


మరో రెండు రోజుల్లో ఈ నవయవ్వనుడు 75వ పుట్టిన రోజు జరుపుకోబోతున్నారు. పుట్టింది రైతు కుటుంబంలో. చదువుకున్నది ఎకనామిక్స్. వృత్తి రాజకీయం. అయినా టెక్నాలజీతో కలిసి పరుగులు తీస్తారు. నడిచేది వర్తమానంలో అయినా.. దృష్టి పాతికేళ్ల ముందుకే సారిస్తారు. ఈయన వయసును గెలిచిన రహస్యం.. బహుశా నిరంతర మేధోమథనం.

సంక్షోభాలను సానుకూలంగా మార్చుకోగల చాతుర్యం.. బడా సంస్థలను సైతం ఒప్పించి రాష్ట్రానికి రప్పించగల నైపుణ్యం.. దేశాధినేతలను సైతం మెప్పించగల మాటకారితనం.. నారావారిపల్లి గడ్డమీద పుట్టిన ఈ రైతుబిడ్డకు ఇవన్నీ ఎలా సాధ్యం..?!

కయ్యాకాలువల్లో ఈతలు.. బడికి మైళ్ల నడకలు.. ఒళ్లొంచి చేసిన పొలం పనులు.. చదువుకునే రోజుల్లోనే శ్రమదానాలతో పల్లెరోడ్లకు మెరుగులు.. బడికోసం జోలెపట్టి ఊరూరా, గడపగడపా తిరిగిన అనుభవం.. వెన్నంటి ఉండే స్నేహబృందాలు.. శీనయ్య మెస్‌లో భోజనాలు.. గురువులతో చర్చలు.. ప్రతి అడుగు నుంచీ చంద్రబాబు పాఠాలు నేర్చుకున్నారని ఆయన బాల్య స్నేహితులూ, ఆయనతో కాలేజీల్లో కలిసి చదువుకున్నవారూ, ఆయనకు చదువు చెప్పిన గురువులూ చెబుతున్నారు. విజనరీగా చంద్రబాబుకు బీజాలు చిన్ననాటి నుంచే పడ్డాయని వారు గుర్తు చేసుకుంటూ ఆంధ్రజ్యోతితో పంచుకున్న జ్ఞాపకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ 20న చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన బంధుమిత్రుల ఇంటర్వ్యూలు ఈ రోజు నుంచీ వరుసగా అందిస్తున్నాం.

75 ఏళ్ల బాబు బాల్య సంగతులు.. 8వ పేజీలో

రేపటి నుంచి

ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్

ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



తిరుపతి/తిరుపతి(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో-2025 జరగనుంది. ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా కొనసాగుతుంది. దక్షిణ భారతదేశంలోని 30 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్ లేదా ప్రీ డిగ్రీ తర్వాత ఏ కోర్సుచేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఎక్స్‌పోను సందర్శిస్తే తగిన అవగాహన కలుగుతుంది. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు తదితర వివరాలతో పాటు విదేశీ విద్యకు సంబంధించిన సమాచారం కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎక్స్‌పోను సందర్శించడానికి, సమాచారం పొందడానికి అడ్మిషన్ల ప్రక్రియకు ఎలాంటి రుసుం లేదు. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాతో పాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎక్స్‌పోలో పాల్గొనే సంస్థలు

అపోలో యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోకు రాజ్యలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ స్పాన్సర్‌గా, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(రామాపురం) కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి. ఈ దిగ్గజ సంస్థలతోపాటు ఐఐటీ మద్రాసు, ఆకాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ఆచార్య, అనురాగ్ యూనివర్శిటీ, వేల్స్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ, మార్వాడీ యూనివర్శిటీ, చెట్టినాడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,సీఎంఆర్ యూనివర్శిటీ, జీఆర్టీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజ్, ఎన్ఐటీటీఈ డీమ్డ్ టుబి యూనివర్శిటీ, ఎన్ఎంఐఎంఎస్ డీమ్డ్ టుబి యూనివర్శిటీ, యూనివర్శిటీ ఆఫ్ పీస్, మెడికో అబ్రాడ్ కన్సల్టెంట్స్, ప్రెసిడెన్సీ యూనివర్శిటీ, శ్రీనివాస అకాడమీ, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఆర్ అకాడమీ, అమిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్ సంస్థలు ఈ ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోలో పాల్గొననున్నాయి.

తిరుపతిలో హైడ్రామా

తిరుపతిలో గురువారం ఉదయం హైడ్రామా చోటుచేసుకుంది. టీటీడీ గోశాలలో వందకుపైగా ఆవులు మృతి చెందాయన్న భూమన ఆరోపణల నేపథ్యంలో వివాదం రాజుకుంది. గోశాల సందర్శనపై సవాళ్లు.. ప్రతిసవాళ్లతో రాజకీయం వేడెక్కింది. గోశాలను కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు సందర్శించారు. గుంపుగా కాకుండా ఐదుగురు నేతలు, వారి వ్యక్తిగత భద్రతా సిబ్బంది మాత్రమే గోశాలకు రావాలని పోలీసులు సూచించినా టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి మాత్రం గుంపుగా బయలుదేరారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది.



- టీటీడీ గోశాల చుట్టూ రాజకీయ రగడ

వైసీపీ హంగామా


తన ఇంటి ముందు రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు, నేతలతో కలిసి బయలుదేరిన తనను పోలీసులు అడ్డుకున్నారంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేలపై పడుకుని నిరసన తెలిపారు. ఉదయం 9.30 నుంచి 45 నిమిషాలకు పైగా ఈ నిరసన చేపట్టారు. గోశాల ఘటనపై ఇంత జరుగుతున్నా సనాతన ధర్మం అంటూ మాట్లాడే పవన్ ఎందుకు మాట్లాడటం లేదని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. గోశాలకు వెళ్లాలనుకున్న భూమనను పోలీసులు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ ఏడాది మార్చి వరకు 191 ఆవులు చనిపోయాయంటూ గోశాల మేనేజరు అధికారికంగా ప్రకటన విడుదల చేశారంటూ మీడియాకు భూమన కరుణాకరరెడ్డి చూపారు. గోశాలకు ఎప్పుడైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, భూమన అభినయ్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మోహరించిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అటు వైసీపీ.. ఇటు కూటమి పార్టీల నేతలు తిరుపతిలోని టీటీడీ గోశాల సందర్శన నేపథ్యంలో పోలీసులు భారీగా మొహరించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇళ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోశాలలోకి కూటమి నేతలు వెళ్లి వారు బయటకు వచ్చాక.. వైసీపీ నాయకులను అనుమతిస్తామని ఎస్పీ ప్రకటించారు. దీంతో ఎక్కడా పరిస్థితి అదుపు తప్పకుండా ముందస్తుగా వారి ఇళ్ల వద్ద పోలీసులు మొహరించారు. ఎస్పీ అనుమతులు లేనిదే వారిని ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా ముందస్తు భద్రత ఏర్పాటు చేశారు. రెండు పార్టీల నేతలను వేర్వేరుగా.. శ్రేణులతో కాకుండా పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. కానీ, మందీమార్బలంతో తన ఇంటి నుంచి బయలుదేరిన భూమనను అక్కడే అడ్డుకున్నారు. ఇక, గోశాల ప్రవేశ ద్వారం వద్ద పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు భక్తవత్సలం (తిరుపతి), చెంచుబాబు (నాయుడుపేట), కొందరు సీఐలు గోశాల లోనూ కూటమి నేతల వెంటే ఉన్నారు. మధ్యాహ్నం 1.26 గంటలకు గోశాల నుంచి వీరంతా బయటకు వచ్చారు. ఇక, భూమన అభినయ్ గోశాల వద్దకు వచ్చినా లోపలకు అనుమతించలేదు. దీనిపై అతను ఆందోళనకు ఉపక్రమించే ఆలోచన ఉందని తెలుసుకున్న పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకుని ఇంటి వద్ద వదలిపెట్టారు. ఇక, గోశాల వద్దకు వచ్చిన ఎంపీ గురుమూర్తికి, కూటమి ఎమ్మెల్యేలకు మధ్య కొంతసేపు వాగ్వాదం నడిచింది. ఎస్పీ జోక్యం చేసుకుని ఎంపీని లోపలకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

గోశాల ప్రవేశ ద్వారం వద్ద భారీ బందోబస్తు


గోశాలలో ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

ఎమ్మెల్యేలు, కూటమి నేతల మాట

తిరుపతి ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా ఉంటే ఆయనకు నచ్చదు

తిరుపతి ప్రశాంతంగా ఉండడం ఆయనకు ఇష్టం ఉండదు. ఆయన అరాచకాలన్నీ ప్రజలకు తెలుసు. భూమన డ్రామా రికార్డు ఇక్కడ అరిగిపోయింది. వేరేచోటకు వెళ్లి నాటకాలు వేసుకుంటే మంచిది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

హిందుత్వంపై దాడికి ముందుంటుంది

గతంలో పింక్ డైమెండ్.. ఇప్పుడు టీటీడీ గోశాలమీద పడ్డారు. ఇలా హిందుత్వంపై దాడికి వైసీపీ ఒంటికాలిపై లేస్తుంటుంది. గోశాలకు రాకుండా రోడ్డుపై కరుణాకర్‌రెడ్డి డ్రామాలు వేయడం సరికాదు.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

భూమన పెద్ద డ్రామా కింగ్

పెద్ద డ్రామా కింగ్ అయిన భూమనకు నంది అవార్డులు ఇవ్వాలి. మేము మూడు గంటలున్నా గోశాలకు రాకుండా రోడ్డుపై నాటకాలాడారు. ఆయన హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఆయన రాజకీయం పరిసమాప్తం

ప్రజలు, ప్రకృతి, కుల, మతాలతో నీచ రాజకీయాలు చేసిన వైసీపీ పవిత్ర గోశాలనూ వదిలిపెట్టలేదు. ఇంతటితో భూమన రాజకీయం పరిసమాప్తమైనట్లే. గోమాతకు క్షమాపణ చెబితే కొంత ప్రాయశ్చిత్తం వస్తుంది.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

రాజకీయ లబ్ధి కోసమే

ఏ జీవరాశికైనా జనన,మరణాలు సాధారణం. విజిలెన్స్ నివేదిక చూస్తే గోవుల మరణాలకు గత నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. రాజకీయ లబ్ధికోసమే వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

తగిన గుణపాఠం చెబుతాం

రాజకీయ హత్యలు చేసేవాళ్లు ఇప్పుడు గోమాతను హతమారుస్తున్నారు. గోవుల మరణాలపై నోటికొచ్చినట్టు చెబుతున్నారు. రాజకీయ లబ్ధికోసం గోశాలను వాడుకుంటున్న వైసీపీకి గుణపాఠం చెబుతాం.

- నరసింహ యాదవ్, చైర్మన్, యాదవకార్పొరేషన్.

ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మరు

ఎన్ని నాటకాలాడినా తిరుపతి ప్రజలు నమ్మరు. గోమాతను అడ్డుపెట్టుకుని భూమన రాజకీయం చేయడమేంటి? చేసిన తప్పును ఒప్పుకుని గోవులకు క్షమాపణ చెప్పాలి.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే, తిరుపతి

కమీషన్ల ఛైర్మన్ ఘనత నీదే

గోవిందుడు, గోవుతో పెట్టుకున్నావు. జరగబోవు పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. నువ్వు వస్తానంటే మేము వద్దన్నామా? ఎందుకు డ్రామాలు ఆడతావు? కమీషన్ల ఛైర్మన్‌గా టీటీడీ చరిత్రలో నిలిచిపోయావు.

- భానుప్రకాష్ రెడ్డి, సభ్యుడు, టీటీడీ

భగవంతుడితో ఆడుకుంటున్నావ్

గత ఎన్నికల్లో 63వేల ఓట్లతో ఓడిపోయిన ఫ్రస్ట్రేషన్‌లో కరుణాకరరెడ్డి భగవంతుడితో ఆటలాడుతున్నారు. వైసీపీ పాలనలో రాముడి తలనరికినా, రథం కాలిపోయినా నిందితులను ఎందుకు పట్టుకోలేదు.

- పసుపులేటి హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, జనసేన

సౌత్ ఇండియన్ బ్యాంకుకు బాంబు బెదిరింపు



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి అన్నారావు సర్కిల్ లోని సౌత్ ఇండియన్ బ్యాంకుకు గురువారం బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. 'మీ బ్యాంకులో బాంబులు పెట్టాం...త్వరలో పేల్చేస్తున్నాం' అని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. అప్రమత్తమైన బ్యాంకు మేనేజర్ అశోక్ వర్ధన్ అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అజిత నేతృత్వంలో డాగ్, బాంబు డిస్పోజల్ టీమ్‌లు, రిజర్వు ఎస్ఐ అమరనాథరెడ్డి, సిబ్బంది కలిసి రెండు గంటల పాటు గాలించారు. బాంబుల ఆనవాళ్లు దొరక్క పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఫేక్ మెయిల్స్ గతంలో కొన్ని హోటళ్లకు వచ్చిన సంగతి తెలిసిందే.


ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న వీసీ ఆచార్య ఉమ

పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. రెండు రోజులుగా యూనివర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ, పాలన తదితర అంశాలను ఐఎస్‌వో బృందం పరిశీలించింది. ఈ అంశాల్లో పద్మావతి మహిళా యూనివర్సిటీ అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తోందంటూ కితాబిచ్చింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను వీసీ ఉమకు హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ ఆలపాటి శివయ్య అందజేశారు. దీంతో పాటు గ్రీన్ జోన్ ఎమ్సెరిగేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ ఎస్.రజని, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ డైరెక్టర్ టి.త్రిపురసుందరి, టి.సీతాకుమారి (లా), ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయోటెక్నాలజీ), పి.విజయలక్ష్మి, బీఎన్ నీలిమ (జర్నలిజం), డాక్టర్ నీరజ (ఉమెన్ స్టడీస్), పీఆర్వో డాక్టర్ శ్రీరజని తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ మాజీ చైర్మన్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ వర్సిటీ సీఐ రామయ్య తెలిపారు. టీటీడీ గోశాలపై అసత్య ఆరోపణలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

'స్థానిక సంస్థల' పరిపుష్టికి నిధులు పెంచండి

- 16వ ఆర్థిక సంఘానికి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న అరవింద్ పనగారియా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజనతో నష్టపోయాం. కేంద్ర నిధులు మరింత పెంచి స్థానిక సంస్థలను ఆదుకోండి' అంటూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో గురువారం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలో సభ్యులు అన్నే జార్జి మథ్యూ, డాక్టర్ మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృతచ, ఆదిత్య పంత్, జ్యోతి నాగర్కోటి, అభయ్‌మీనన్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కేంద్ర సహకారంతో సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి. తద్వారా మున్సిపాలిటీల్లో విద్యుత్ భారం తగ్గుతుంది. ఆ నిధులను మౌలిక వసతులకు వినియోగిస్తాం' అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఏటా ఆర్థిక సంఘం ఇచ్చే నిధులు మరింత పెంచాలని సత్యవేడు జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతల్లో పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం ఆర్థికసంఘం నిధులు పెంచితే స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతమవుతాయని తిరుపతి రూరల్ చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా వచ్చే ఆదాయంతో పల్లెలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీపీ జ్యోత్స్న అన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఈసారి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పెంచాలని పంచాయతీ, మున్సిపాలిటీ, నగరకపాలకసంస్థ కార్యాలయాలకు సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేయాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రత్నకుమారి ఆర్థిక సంఘాన్ని కోరారు. మీ సలహాలు, సూచనలు, అభిప్రాయలను కమిషన్ పరిశీలిస్తుందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి 33 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


జోగేశ్వరరావు, సభ్యులు- అఖిలప్రియ- సమీర- కల్కి రాజ- ఆర్కే రోజా

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు, సభ్యులు భూమా అఖిలప్రియ, కల్యాణి, జయకృష్ణ, వెంకటరాజు, పార్థసారథి, సునీల్ తదితరులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ మంత్రి ఆర్కే రోజా, సినీ నటుడు కల్కి రాజ, గాయని సమీర కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

టీటీడీకి అవసరమైన సూచనలు చేస్తాం

దర్శనం అనంతరం అంచనాల కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించి టీటీడీ బడ్జెట్, ఖర్చు వివరాలను తెలుసుకుంటామన్నారు. అవసరమైన సూచనలు చేస్తామన్నారు. లోటుపాట్లు ఉంటే అసెంబ్లీకి నివేదిక సమర్పిస్తామన్నారు. అఖిలప్రియ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం, అంతకుముందు ప్రభుత్వాల్లో ఏదైనా పొరపాటు జరిగి సరిచేసేలా చూస్తామన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లకు కృషి చేయాలి

పాకాల,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థ బలోపేతం చేయడంలో అంగన్వాడీ కేంద్రాలది కీలకపాత్ర అని ఎంఈవో బాబ్జీ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం అంగన్వాడీ సూపర్‌వైజర్లు కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. బాబ్జీ మాట్లాడుతూ బాల్యంలోనే అంగన్వాడీ కేంద్రంలో చక్కని పునాది పడాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యాబోధన గురించి వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను ఈనెల 20 నుండి 23వ తేదీ లోపు సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కిరణ్మయి, సీఆర్పీలు శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి, మునికృష్ణ, జ్యోతి, శివకుమారి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

చంద్రగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. గురువారం కొటాల, దోర్నకంబాల పంచాయతీల్లో ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.


కొటాలలో మహిళలతో మాట్లాడుతున్న సుధారెడ్డి

ఈసందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వమన్నారు. మహిళల స్వయం ఉపాధి కల్పనకు అనేక శిక్షణా కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పెన్షన్లు కోసం దరఖాస్తులు సచివాలయాల్లో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, నాయకులు గౌస్‌బాషా, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

డిజిటల్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్యజ్యోతి): డిజిటల్ ల్యాబ్‌ను సక్రమంగా ఉపయోగించుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆయన మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో


పిల్లకు సూచనలు చేస్తున్న డీఈవో కుమార్

తరగతుల నిర్వాహణను,డిజిటల్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణి చేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు వినూత్నంగా అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. మార్కులు,ర్యాంకులే లక్ష్యం కారాదన్నారు. ఆత్మవిశ్వాసం, సానుకూల ధోరణి, స్వయం ప్రేరణ, అభ్యసన వంటి అంశాల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. భోజనం రుచి, శుభ్రతలను పరిశీలించారు. విద్యా రాష్ట్ర పరిశీలకుడు హైమేశ్వరరావు,ఎంఈవో బాల సుబ్రమణ్యం,జీసీడీవో పుష్పలత, ప్రిన్సిపాల్ పరిమళ, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి డీకే సారథి,అధికారులు రుక్మానంద,రేవతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన చెత్త సేకరణ ట్రైసైకిళ్లు

తిరుపతి రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలుగ్రామ పంచాయతీల్లో చెత్తసేకరణ కోసం వినియోగించే ట్రైసైకిళ్లు మూలకు చేరాయి. అప్పట్లో స్వచ్ఛాంధ్రప్రదేశ్ జీరోవేస్ట్ పంచాయత్ ప్రాజెక్ట్ కింద చెత్తను సేకరించేందుకు



గ్రామపంచాయతీలకు వీటిని అందించారు. ఇప్పుడు చెత్తసేకరణ కోసం ఆటోలని ఇవ్వడంతో వీటి అవసరం లేకపోయింది. పలుగ్రామాల్లో మూలకు చేరిన ఎండకు ఎండి..వానకు తడిసి తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల పంచాయతీ కార్యాలయాల ప్రాంగణంలో ..మరికొన్ని గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లోని ఖాళీస్థలంలో దర్శనమిస్తున్నాయి. కొన్ని పంచాయతీల్లో చెత్తసేకరణ మినీ ఆటోలను కూడా మూలనపడేశారు. మరమ్మతులు చేపడితే వీటిని ఉపయోగించుకునే వీలుంది. ఈదిశగా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇలాగైతే మురుగు పారేదెలా..?

తిరుపతి రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామ సచివాలయానికి సమీపంలోని కాలువలో మురుగునీరు నిలిచిపోయింది దుర్వాసన వెదజల్లుతోంది. సర్వేనంబరు 208లోని కాలువభూమి క్రమేణా ఆక్రమణలకు గురికావడంతో మురుగునీరు పారేందుకు దారి పరిస్థితి ఏర్పడింది. దీంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువభూమిగా ఉన్న దీన్ని గతంలో అనాధీనంగా రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేశారని సమాచారం. ఈభూమిలో ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


కాలువలో నిలిచిపోయిన మురుగునీరు

రాములవారి ఆలయ పోటులో జెర్రిపోతు


పోటులో పట్టుబడిన జెర్రిపోతు

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలోని రాములవారి ఆలయ పోటులో గురువారం రాత్రి జెర్రిపోతు పాము పట్టుబడింది. పాదాల మండపం సమీపంలోని ఆలయ పోటులోకి సుమారు ఎనిమిది అడుగుల పొడవైన జెర్రిపోతు పాము ప్రవేశించింది. దీంతో కార్మికులు హడలిపోయి బయటకు పరుగులు తీశారు. వెంటనే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకున్నాడు. ఉదయం తిరుమలలోని బాలాజీ గెస్ట్‌హౌస్ వద్ద ఆరు అగుడుల పొడవైన జెర్రిపోతు పామును కూడా ఆయన పట్టుకున్నాడు. పట్టుబడిన పాములను భాస్కర్ నాయుడు దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

చెర్లోపల్లెలో పంచాయతీరాజ్ కమిషనర్


స్వాగతం పలుకుతున్న సర్పంచ్ సుభాషిణి,సిబ్బంది

తిరుపతి రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చెర్లోపల్లె గ్రామపంచాయతీని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ సందర్శించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్థిక సంఘ సమావేశానికి హాజరైన అనంతరం ఇక్కడకు వచ్చారు. సర్పంచ్ సుభాషిణి నేతృత్వంలో స్వాగతం పలికారు. పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చేలా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ని పరిశీలించి అభినందించారు. జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, తిరుపతి, చిత్తూరు డీఎల్‌పీవోలు సుశీలాదేవి, సుధాకర్ రావు, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, అధికారులు, మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

తిరుమలలో ఛైర్మన్ తనిఖీలు


భక్తులతో మాట్లాడుతున్న బీఆర్‌నాయుడు

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులతో ఆలయం ముందు మాట్లాడి దర్శన ఏర్పాట్లపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. లడ్డూ, అన్నప్రసాదాలు చాలా రుచికరంగా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా టీటీడీ సాంకేతిక సేవల్లో కొన్ని లోపాలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధులను ఆఫ్‌లైన్ కూడా దర్శనానికి అనుమతించేలా నిర్ణయం తీసుకోవడంపై భక్తులు ఛైర్మన్‌తో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్యూలైన్లనుపరిశీలించి భక్తులకు కల్పిస్తున్న అన్నప్రసాదం, తాగునీటి సదుపాయాలపై ఆరా తీశారు. వేసవి రద్దీకి తగినట్టు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. మంగళవారం హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు లభించింది. బుధవారం 70,372 మంది భక్తులు దర్శించుకున్నారు. 24,463 మంది తలనీలాలు సమర్పించారు.

'వర్మ నర్సింగ్ కళాశాల అనుమతులను రద్దు చేయాలి'


విద్యార్థినులతో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వర్మ నర్సింగ్ కళాశాల అనుమతులను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయక కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. ఎర్రమిట్టలోని వర్మ నర్సింగ్ కళాశాల ఛైర్మన్ గోవిందరాజులు విద్యార్థినులతో అసభ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు రావడంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. చలపతి మాట్లాడుతూ లేడీస్ హాస్టల్లో మహిళా వార్డన్‌ను నియమించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థినులను వేధించిన ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులతో కలిసి ర్యాలీగా అలిపిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ఒకటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 50 ఉచిత శిక్షణ కేంద్రాలు(పట్టణాల్లో 25, గ్రామీణ ప్రాంతాల్లో 25) ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నిర్వహణపై ఆసక్తిగల క్రీడా సంఘాలు, ఎస్జీఎఫ్ కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 8 నుంచి 14 వయస్సు ఉన్న బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 95420 34270లో సంప్రదించాలని కోరారు.


తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం హీరో ప్రదీప్ మాచిరాజు, హీరోయిన్ దీపిక పిల్లి, దర్శకులు నితిన్, భరత్ **- తిరుమల, ఆంధ్రజ్యోతి**

చెత్త సంపద ప్లాంట్ పనితీరు భేష్

● ఆర్థిక కమిషన్ బృందం కితాబు

రేణిగుంట, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూకివాకం పంచాయితీ పరిధిలోని నగర పాలక సంస్థ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిన సంఘం కమిషన్ కితాబు ఇచ్చింది. గురువారం ఉదయం ఈ ప్లాంట్‌ను కమిషన్ సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. ఘన వ్యర్థాల, తడి చెత్త నిర్వహణ, కంపోస్టు, బయో మెథనైజేషన్ ప్లాంట్ తదితర అంశాల గురించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ పిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, నివాస్‌లు బృందానికి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన పొడి చెత్తను ప్రాసెసింగ్ చేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిసామని చెప్పారు. తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తామన్నారు. మార్కెట్, హోటల్స్ వ్యర్థాలను వంట గ్యాస్‌గా ఉత్పత్తి చేసి విక్రయిస్తామన్నారు. నగరంలో రోజూ సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా విభజించి గుల్ల, ఇసుకగా మారుస్తామన్నారు. బృంద సభ్యులు ఆసక్తిగా ఈవిషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.


వ్యర్థాల ద్వారా గుల్ల ఇసుక తయారీ విధానాన్ని ఆర్థిక సంఘం చైర్మన్‌కు వివరిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

'సీమ'లో పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి

● ఆర్థిక సంఘం చైర్మన్‌కు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, పరిశ్రమల ప్రతినిధుల విజ్ఞప్తి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, డీఐసీసీఐ, పలువురు పారిశ్రామిక వేత్తలు కోరారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, పవర్ సబ్సిడీలకు మరిన్ని నిధులు మంజూరు చేయాలన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో గురువారం 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలో ఫుడ్ టెక్నాలజీ ఇంకుబేషన్, పరిశోధన శిక్షణ కేంద్రాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు ఆర్థిక భరోసా కల్పించి వికసిత్ భారత్‌లో సుస్థిర స్థానం కల్పించాలని డీఐసీసీఐ జోనల్ ప్రెసిడెంట్ వెంకటరమణతో పాటు పలువురు కమిషన్‌ను కోరారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్, అసోచామ్, డీఐసీసీఐ, ఫ్యాప్సియా, ఎఫ్ఎస్ఎంఈ, పారిశ్రామికవేత్తలు భాస్కర్‌రావు, రమాదేవి, రవికుమార్ రెడ్డి, విజయ్‌నాయుడు, మురళీకృష్ణ, రమేష్ నాయుడు తదితరులు కమిషన్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పై రెండు సమావేశాల్లో రాష్ట్ర ఫైనాన్స్‌ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్, అదనపు సెక్రటరీ నివాస్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణతేజ, మున్సిపల్ శాఖ నుంచి సురేష్‌కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనరు మౌర్య, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

గ్రాంట్ల పరిధిని పెంచండి

రాష్ట్రాభివృద్ధిలో క్రియాశీలకపాత్ర పోషించే గ్రామీణాభివృద్ధికి గ్రాంట్ల పరిధిని పెంచి స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు సహకరించాలని అనంతరపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ వరుణ్, తిరుపతి కార్పొరేటర్ ఎస్‌కే బాబు, జనసేన నేతలు 16 ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రాంట్లు పెంచాలని కోరారు.

● రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు 16 ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాకు వినతిపత్రం అందజేశారు. కేంద్రం పన్నుల వాటాల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 50శాతానికి పెంచాలని, వెనుకబడిన జిల్లాలకు సీజీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని ప్రతినియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులు మంజూరుకు ఫైనాన్స్ కమిటీని కోరారు.

వర్మ నర్సింగ్ కళాశాలలో డీఎంహెచ్‌వో విచారణ

● కరెస్పాండెంట్ తీరుపై విద్యార్థినుల ఫిర్యాదు ● నిబంధనలు పాటించడంలేదని గుర్తించిన అధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నర్సింగ్ విద్యార్థిని పట్ల కరస్పాండెంట్ అసభ్యకరంగా ప్రవర్తించడంపై గురువారం డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ విచారణ చేపట్టారు. ఈ కళాశాలను నిబంధనలను విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. తిరుపతిలోని ఓ చిన్నపాటి అపార్టుమెంటులో వర్మ కలేజ్ ఆఫ్ నర్సింగ్ ఉంది. కరస్పాండెంట్ గోవిందరాజుల వర్మ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఆయన ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించగా, తోటి విద్యార్థులు ఫోన్‌లో వీడియో తీయడంతోపాటు డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. మద్యం మత్తులో ఉన్న గోవిందరాజుల వర్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, సిబ్బంది కలిసి కళాశాలలో విచారించారు. చిన్నపాటి ఇరుకు గదుల్లో పది మందికి పైగా విద్యార్థులను ఉంచుతూ, వారు పడుకునేందుకు కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. రుచి పచి లేని భోజనాలతో అర్థాకలితో ఉండాల్సి వస్తుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస నిబంధనలూ పాటించడం లేదని అధికారులు గుర్తించారు. ఈ నెల 24, 26 తేదీల్లో పరీక్షలు ఉండగా, అడిగినంత ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికట్లు ఇస్తామని బెదిరిస్తున్నారని వారు అధికారుల ఎదుట వాపోయారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు కరస్పాండెంట్‌పై పలువురు ఫిర్యాదు చేశారు. నిబంధనలను పాటించని కళాశాలను సీజ్ చేసి విద్యార్థులను వేరే చోటికి మార్చేందుకు ప్రయత్నం చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆ దిశగా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ విద్యార్థినులతో మాట్లాడి, కరస్పాండెంట్ గోవిందరాజువర్మపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు కరస్పాండెంట్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


కళాశాలలో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

యూట్యూబ్‌లో వీడియోలు చూసి స్కూటర్ దొంగతనాలు

● యువకుడి అరెస్టు ● రూ. 9లక్షల సొత్తు స్వాధీనం

తిరుచానూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. జులాయిగా తిరిగాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈజీమనీ సంపాదించాలని యూట్యూబ్‌లో మోటార్‌సైకిళ్ల దొంగతనాలు చూసి దొంగగా మారాడు. ఎట్టకేలకు తిరుచానూరు పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్‌ఐ అరుణ గురువారం రాత్రి మీడియాకు తెలిపిన వివరాలు ఇలా.. పూతలపట్టుకు చెందిన గోపి(19) జులాయిగా తిరుగుతూ తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచివచ్చేశాడు. ద్విచక్ర వాహనాలు ఎలా దొంగతనం చేయాలో యూట్యూబ్‌లో వీడియోలు చూశాడు. రెండు రోజుల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో మోటారుసైకిళ్లు, సెల్‌ఫోన్లు వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. గురువారం తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్యపురం వద్ద నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 12 మోటారు సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ సునీల్‌కుమార్, ఎ స్‌ఐ అరుణ, సాయినాథ్‌చౌదరిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

'రాష్ట్రంలో రానున్న కాలం బీజేపీదే'

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న కాలం బీజేపీదేనని ఆ పార్టీ నేత, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం తిరుపతిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వరప్రసాద్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో బీజేపీ ప్రాతినిథ్యం ఉండాలన్నారు. అందుకోసం సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ నరేష్, నాదముని, దీపక్ యాదవ్, దస్తగిరిరెడ్డి, ప్రభాకర్, జల్లి మధుసూదన్, నవీన్, పార్థులు గోపి, చంద్ర, సుబ్బు, ప్రసాద్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానించిన బీజేపీ నేతలు

మహిళను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మంగళం కృష్ణవేణి యాదవ్‌కాలనీలో ఒక ఆస్తి విక్రయ విషయమై హేమలత అనే మహిళపై దాడి చేసిన తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథచౌదరి, మహిళా కానిస్టేబుల్ సునీతపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో బాధిత మహిళతో కలిసి ఆమె మాట్లాడుతూ రోడ్డుపై నడుచుకుని వెళుతున్న హేమలతను పోలీసులు దౌర్జన్యంగా జీపులో తీసుకెళ్లి తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వాలంటూ చిత్రహింసలకు గురి చేశారన్నారు. వారిపై రాష్ట్ర మహిళా కమిషన్, మానవ హక్కుల సంఘం, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, నాగమ్మ, సుజాత, లత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలక్ష్మి

ఫోరెన్సిక్ విభాగాధిపతిపై విచారణ చేపట్టండి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉంటూ బదిలీపై ఎస్వీ వైద్య కళాశాలకు వచ్చిన ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ జడ్.శశికాంత్ ఓ పోస్టుమార్టం కేసులో తప్పుడు నివేదిక సమర్పించారనే దానిపై విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్‌కు ఆదేశాలు అందాయి. బి.నాగలక్ష్మీ అనే మహిళ మృతదేహానికి చేసిన పోస్టుమార్టంలో తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆరోపిస్తూ బాధితులు కోర్టును ఆశ్రయించారు. విచారణాధికారిగా ప్రిన్సిపల్ చంద్రశేఖరన్‌ను నియమించింది.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభహారతి, మహామంగళ హారతులు ఇచ్చారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్దశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా సంకట చతుర్థి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా గురువారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అభిషేకం నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ జాతర గురువారంతో ముగిసింది. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు.

అనాథ చిన్నారులకు వేసవి వినోదం



బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్‌లో రాస్, అక్షయ క్షేత్రం చిన్నారులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాస్, అక్షయ క్షేత్రంలోని అనాథ చిన్నారులకు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ వేసవి వినోదాన్ని అందించింది. సొసైటీ నెలవారీ ఈవెంట్లలో భాగంగా బుధవారం చిన్నారులను చంద్రగిరి సమీపంలోని బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్‌కు తీసుకెళ్లారు. పార్క్‌లోని అనేక రైడ్స్‌లో చిన్నారులు పాల్గొనేలా చేశారు. సొసైటీ ఉపాధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ చిన్నారులు చాలా సంతోషంగా గడిపారని తెలిపారు. ఈవెంట్‌కు విరాళాలు ఇచ్చిన దాతలకు, సహకరించిన వాటర్ పార్క్, రాస్, అక్షయ క్షేత్రం యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని బండారు కాలనీలో బుధవారం రాత్రి ఆటో చోరీకి గురైంది. ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య వివరాల మేరకు.. బండారు కాలనీలో కాపురముంటున్న మురళి ఇటీవల ఆటో కొనుగోలు చేశాడు. బుధవారం రాత్రి ఆటోను ఇంటి ముందు ఆపాడు. ఉదయం లేచి చూడగా కనపడలేదు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

టిప్పర్ ఢీకొని విద్యార్థికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి గాయపడిన ఘటన గురువారం అన్నమయ్య సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. తిమ్మినాయుడుపాళెంకు చెందిన రామ్‌చరణ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన పరీక్షల్లో ఫెయిల్ కావడంతో పరీక్ష ఫీజు చెల్లించి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. టీవీఎస్ షోరూం సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వైపు అతి వేగంగా వెళుతున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రామ్ చరణ్‌కు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రామ్‌చరణ్‌ను తిరుపతి రుయాకు తరలించారు. వెదురుకుప్పం మండలం బీఆర్ కండ్రిగకు చెందిన టిప్పర్ డ్రైవర్ ధనంజయులు రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ప్రతిష్ట దిగజార్చకండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): గోశాలలో గోవుల మృతిపై అధికార, ప్రతిపక్ష నాయకులు గోల చేయడం మానుకుని వాస్తవాలపై విచారణ చేపట్టాలని, తద్వారా టీటీడీ ప్రతిష్ఠను కాపాడాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళి కోరారు. గోవులు మృతి చెందుతున్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలపై అధికార పార్టీ విచారణ జరపకుండా సవాళ్లు విసురుకోవడం వల్ల కలిగే ఫలితం ఏమీ ఉండదన్నారు. నేతల తీరును నగర ప్రజలు ఏవగించుకుంటున్నారని పేర్కొన్నారు.

అన్నదానంలో సంతృప్తి ఉంది



అన్నదానం చేస్తున్న నేతలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదానం చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆనంద్ యాదవ్ (టీడీపీ) అన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆర్‌సీ రోడ్డులోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద తులసీ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ ఇంటి వద్దకెళ్లి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు బిజీ కృష్ణయాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, అనిత యాదవ్, ధనశేఖర్ యాదవ్, మధు, శ్రీనుయాదవ్, శంకర్ యాదవ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. కొర్లగుంట, తుడరోడ్డు, వినాయకనగర్, తాతయ్యగుంట, 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరువణ్ణామలై యాత్రకు ఆదరణ

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడు లేనివిధంగా తిరువణ్ణామలై యాత్రకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభించింది. పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణకు భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ గత శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడిపింది. 121 బస్సులు 54,248 కిలోమీటర్లు తిరిగాయి. ఈపీకే రూ.56, ఆక్యుపెన్సీ రేషియో 91శాతం, రాబడి రూ.30,46,607 లభించిందని డీపీటీవో జి.నరసింహులు తెలిపారు.

సైన్స్ కాలేజ్ మేగజైన్ విడుదల



మేగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైన్స్ కాలేజ్ మేగజైన్ (ఇంక్ అండ్ ఇమాజినేషన్)ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాల్ పద్మావతి గురువారం విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన కాలేజీ విషయాలు ఇందులో పొందుపరిచారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహులు, ఎగ్జామ్స్ డీన్ కిషోర్, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్లు కేవీ సుచరిత, కేటీ రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, బాలాజీ, నిసార్ పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో 'పొగ'పాట్లు

- చెత్తను ఎక్కడబడితే అక్కడే కాల్చేస్తున్న వైనం
- బాలింతలు, పసికందుల ఆరోగ్యంపై ప్రభావం





ప్రసూతి ఆస్పత్రి ముందు చెత్తను కాలుస్తున్న దృశ్యం - ఆస్పత్రి ఆవరణలో దట్టంగా కమ్ముకున్న పొగ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బాలింతలకు, పురిటి బిడ్డలకు పొగపాట్లు తప్పడం లేదు. ఆస్పత్రి ఆవరణలో నిత్యం సమకూరే చెత్తను ఎక్కడబడితే అక్కడ కాల్చేస్తుండడంతో దాని నుంచి వచ్చే పొగతో చికిత్స పొందుతున్న బాలింతలు, పురిటి బిడ్డలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఆస్పత్రి పరిసరాల్లో సేకరించే బయో వ్యర్థాలు, చెత్తను దూర ప్రాంతాలకు తరలించాలి. ఆ బాధ్యతను ప్రభుత్వం ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. వారు సేకరించిన చెత్తను, బయో వ్యర్థాలను బయటకు తరలించకుండా ఆస్పత్రిలో వాహనాలు పార్కింగ్ చేసే ప్రదేశంలో కాల్చేస్తున్నారు. దీంతో పొగ, దుర్వాసనతో ఆస్పత్రి బయట ఉండే సహాయకులే కాకుండా చికిత్స పొందే బాలింతలు, పురిటిబిడ్డలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ బిడ్డలు, బాలింతల ఊపిరితిత్తుల్లోకి చేరితే ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయంపై ఇప్పటికే ఆస్పత్రి అధికారులు పలుమార్లు ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించినా పట్టించుకోకుండా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు ఎత్తేయాలి

- కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నేతల నిరసన
- బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అక్రమ కేసులతో బెదిరించాలనుకోవడం బీజేపీ నేతల చేతగానితనానికి నిదర్శనమన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ ప్రభుత్వం దేశభక్తి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ మతోన్మాద చర్యలకు పాల్పడుతోందన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని మట్టుపెట్టాలని చూస్తోందని విమర్శించారు. తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ బీజేపీ అధికార బలంతో ఇష్టానుసారం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ వంటి జాతీయ దర్యాప్తు సంస్థలను తనకు ఊడిగం చేసే సంస్థలుగా మార్చుకుంటోందని ఆరోపించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకటనరసింహులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలను తప్పుడు కేసులతో బెదిరించడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లోకేశ్వరరెడ్డి, తలపా దామోదర్‌రెడ్డి, మల్లికార్జున, శివ బాలాజీ, చెంగ్రాయులు, తలారి గోపి, మహేష్, తవన్‌కుమార్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్లస్టర్‌లోకి ఎస్వీయూ

- జాతీయ స్థాయి పరిశోధనల్లో భాగస్వామ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఆర్ఎఫ్-ఫెయిర్ కార్యక్రమంలో భాగంగా భాగస్వామ్య పరిశోధనలు చేపట్టేందుకు దేశంలోని ప్రముఖ యూనివర్సిటీలను క్లస్టర్లు నిర్ణయించారు. ఇందులో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) క్లస్టర్‌లో భాగస్వామ్యం వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆరు యూనివర్సిటీల్లో ఎస్వీయూ ఒకటిగా నిలిచింది. షుగర్, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులపై ఈ క్లస్టర్ పరిధిలోని యూనివర్సిటీలు సంయుక్త పరిశోధనలు చేయనున్నాయి. దీనిద్వారా ఎస్వీయూకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పెరిగిందని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. తద్వారా మరింత గుర్తింపును కూడా పొందే అవకాశముందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహులు, ప్రొఫెసర్లు హేమ, దివాకర్‌రెడ్డి, రాజశేఖర్, కామాక్షమ్మ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం

- బీరు బాటిళ్లతో దాడి
- ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక లీలామహల్ సెంటర్ వద్ద గురువారం రాత్రి మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో బీరు బాటిళ్లతో దాడులు చేసుకుంటూ చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేశారు. జీవకోన, సత్యనారాయణపురానికి చెందిన కొందరు యువకులు లీలామహల్ సమీపంలోని ఒక బార్‌లో మందు తాగారు. మద్యం మత్తులో ఇరు వర్గాల వారు గొడవకు దిగారు. బీరు బాటిళ్లతో కొట్టుకున్నారు. అరగంటపాటు హల్‌చల్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు చొరవ తీసుకుని సర్దిచెప్పి పంపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తిరుపతి డిపో ప్రధాన గేటు ముందు గురువారం ఉదయం ఎన్ఎంయూ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఎన్ఎంయూ నేతలు ప్లకార్డ్స్ చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ మాజీ, తాజా నాయకులు డి.వి.ఆర్.కుమార్, ఎన్.రమణయ్య, భాస్కర్, ఎ.దాము, బి.ఎస్.బాబు, నేతాజీ, వి.వి.కె.నాయుడు, రమణయ్య, రఘుపతి పాల్గొన్నారు.

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి


తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 868888880లను సంప్రదించాలని సూచించారు. అపుస్మా నేతలు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్‌బాబు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలతోనే మాపై క్రిమినల్ కేసులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చట్టపరంగా కొనుగోలు చేసిన ఆస్తిపై తప్పుడు ఆరోపణలు చేసి, తమపై క్రిమినల్ కేసులు పెట్టారని బాధితుడు మురళీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాదులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2023లో ప్రదీప్, కృష్ణ చైతన్య యాదవ్ అనే వ్యక్తులు తన వద్దకు వచ్చి తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇల్లు ఉందని కొనుగోలు చేయమని చెప్పారన్నారు. తాను కూడా అన్నీ పరిశీలించి బ్యాంకు రుణానికి దరఖాస్తు చేసుకుని ప్రదీప్ పేరుతో రిజిస్టర్ సేల్ డీడ్ ఉన్న భూమి 60 అంకణాలను కొనుగోలు చేశానన్నారు. అయితే గతంలో శ్రీదేవి అనే మహిళ తన కుమార్తె హిమవతి(అసలు యజమాని) నుంచి స్థలంపై జీపీఏ పొంది సదరు స్థలాన్ని ప్రదీప్‌కు రిజిస్టర్ సేల్ డీడ్ ధరకు విక్రయం చేసిందన్నారు. లీగల్ ఒపీనియన్ తీసుకుని సదరు స్థలాన్ని ప్రదీప్ నుంచి రూ.2.30 కోట్లకు కొనుగోలు చేశానన్నారు. ఆ తర్వాత అద్దె ఇవ్వకపోవడంపై ప్రశ్నించడంతో ఇల్లు తనదని, నేనెవరికీ అమ్మలేదని అడ్డం తిరిగారన్నారు. పైగా ప్రదీప్, కృష్ణ చైతన్యయాదవ్‌తో పాటుగా తనపై క్రిమినల్ కేసులు నమోదు చేయించిందన్నారు. న్యాయవాదులు క్రాంతి చైతన్య, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి సహించలేకే అసత్య ఆరోపణలు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె) : కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని సహించలేకనే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో వైసీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేసే ప్రయత్నంలో అబాసుపాలయ్యారన్నారు. కూటమి నేతల సవాలుకు సమాధానం చెప్పలేక రోడ్డుపై పడుకుని దొర్లారని ఎద్దేవా చేశారు.



తిరుపతి


ఆంధ్రజ్యోతి

చంద్రబాబు గొప్ప దార్శనికుడు అని ప్రపంచం కీర్తిస్తుంది. సంక్షోభాలను సైతం అనుకూలంగా మలచుకోగల నేర్పుగల నాయకుడు అని రాజకీయ పండితులు పొగుడుతారు. ఇంజనీరింగ్ చదువుకోలేదు కానీ టెక్నాలజీని ఔపోసన పట్టిన మేధావిగా అందరూ గుర్తిస్తారు. అభివృద్ధికి దారులు వెతకడానికి తపనపడే నారా చంద్రబాబు నాయుడిలో ఈ లక్షణాలన్నీ చిన్ననాటి నుంచే ఉన్నాయి.

నారావారిపల్లిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు.. వెనుకబాటుతనంపై సీఎంగా చేస్తున్న పోరాటానికి బీజాలు బాల్యంలోనే ఉన్నాయని ఆయన చిన్ననాటి నేస్తాల మాటల్లో వెల్లడవుతోంది.. ఈ 75 ఏళ్ల నిత్య ఉత్సాహి బాల్య జ్ఞాపకాలను ఆంధ్రజ్యోతితో వారు పంచుకున్నారు.

ఇంటర్వ్యూలు
ఆంధ్రజ్యోతి బ్యూరో
తిరుపతి





భూములు, బావులున్నోడే!

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడుకు రెండెకరాల భూమి మాత్రమే వుండేదని, అలాంటిది చంద్రబాబుకు ఇంత ఆస్తి ఎలా వచ్చిందని రాజకీయ ప్రత్యర్థులు తరచూ ఆరోపణలు, విమర్శలు చేస్తుంటారు. అవి విన్నప్పుడు నాకు నవ్వు వస్తుంటుంది. మాది ఎ.రంగంపేట. చంద్రబాబుది నారావారిపల్లి. ఇద్దరం ఆరో క్లాసు నుంచీ కలసి చదువుకున్నాం. ఇప్పటికీ మా ఫ్రెండ్‌షిప్ కొనసాగతానే వుంది. మేము హైస్కూల్లో చదువుకునేటప్పటికే చంద్రబాబు వాళ్ళకు 15 ఎకరాల భూములు వున్నాయి. చెరకు, వరి, వేరుశెనగ పంటలు వేసే వాళ్ళు ఎంతమంది ఎన్ని అన్నా చంద్రబాబు నోరు మెదపడు. నా చిన్నతనంలోనే 15 ఎకరాలు వుండేదని చెప్పి ప్రత్యర్థుల నోళ్ళు మూపించచ్చు కదా! కానీ అలా చేయడు. అదీ చంద్రబాబు!

పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు ఖర్జూరనాయుడు

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడు ఆ రోజుల్లోనే చుట్టుపక్కల రైతులకు అప్పులిచ్చేవాడు. నాకు బాగా గుర్తుంది. అవసరానికి వచ్చి అప్పు అడిగే వాళ్ళకు, ఆయన ఆ కాలంలోనే పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు.పంచె అంచు పక్కకు లాగి డ్రాయరు జేబులో నుంచీ నోట్లు తీసి లెక్కబెట్టి ఇవ్వడం ఎన్నో సార్లు చూసినా.

12 కిలోమీటర్లు నడిచి బడికి

చంద్రబాబూ నేనూ రోజూ అడ్డదావన ఆరు కిలోమీటర్లు నడిచి చంద్రగిరి హైస్కూలుకు పోయేవాళ్ళం. మళ్ళా సాయంకాలం ఆరు కిలోమీటర్లు నడిచి ఇంటికి చేరేవాళ్ళం. నారావారిపల్లి నుంచీ దర్శిపల్లి దళితవాడ, పుల్లయ్యగారిపల్లి, కొట్టాల గరండాలు (రైలు వంతెన), రెండు గుట్టల మధ్య ఆంజనేయస్వామి గుడి దాటి చంద్రగిరి హైస్కూలు గ్రౌండ్‌లోకి వెనక దారి నుంచీ చేరుకుంటా వుంటిమి. స్కూల్లో చంద్రబాబుది బి సెక్షన్. నాది సి సెక్షన్. క్లాసులోనే విడిగా కుర్చునేది. మిగిలిన సమయమంతా ఇద్దరం కలిసే తిరిగే వాళ్ళం.



పడాకుల సుబ్బరామిరెడ్డి

నారావారిపల్లికి అనుకుని ఉండే ఏ.రంగంపేట వాసి పడాకుల సుబ్బరామిరెడ్డి. చంద్రగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చంద్రబాబుతో కలసి చదువుకున్నారు. తర్వాత మళ్ళీ తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కలసి డిగ్రీ చదివారు. సన్నిహిత మిత్రుడు. రాజకీయాల్లో కూడా చంద్రబాబు వెన్నంటి నడిచారు. ఏ.రంగంపేటకు గతంలో టీడీపీ తరపున ఎంపీటీసీగా కూడా గెలిచారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే నివసిస్తున్నారు.

పాస్ చేయలేదని స్కూలే మారిపాయినాడు

చంద్రగిరి హైస్కూలులో చంద్రబాబు చదివింది తొమ్మిది దాకానే. తొమ్మిదో తరగతి పరీక్షల్లో చంద్రబాబుకి మ్యాథ్స్‌లో పాస్ మార్కుల కంటే ఒక మార్కు తగ్గింది. పదహైదు ఇరవై మందిమి కలసి హెడ్‌మాస్టర్ పద్మనాభరెడ్డి దగ్గరికి పోయినాం. ఒక్క మార్కే..సార్.. పాస్ చేయండి సార్.. అని బతిమిలాడినాం. ఆయన మొండోడు. కాదనేసినాడు. ఇంక ఊళ్ళో పెద్దోళ్ళంతా కలసి ఆర్ఎంఎస్ నాయుడును కలిసి అడిగినారు. ఆయనా కుదరదనేసినాడు. దీంతో చంద్రబాబు 'నాకు చంద్రగిరి హైస్కూలే వద్దు' అని టీసీ తీసుకునేసినాడు. తిరుపతిలో టీపీపీఎం హైస్కూలో చేరిపోయినాడు. చంద్రబాబుకు అంత పౌరుషం, పట్టుదల వుండేది.

మా సైకిలు జోరు

చంద్రబాబుకు వాళ్ళ నాయన తొమ్మిదో తరగతిలో కొత్త సైకిల్ కొనిచ్చినాడు. నాకు ఎనిమిదిలోనే సైకిల్ కొనిచ్చినారు. చంద్రబాబు, నేను ఇద్దరం కొత్త సైకిల్ మీద తెగ తిరిగేవాళ్ళం. అప్పట్లో చంద్రగిరి హైస్కూల్లో సరస్వతీ పూజకి పూలు తేవల్రా అని టీచర్లు చెప్పినారు. ఇంకేం కొత్త సైకిలు ఉండనే ఉంది. రయ్యిమని ఇద్దరం నారావారి పల్లికి చేరుకున్నాం. పుల్లయ్యగారిపల్లి కాలవలో గన్నేరు పూలు, మొగిలి పూలు పెరుక్కుని తిరిగి స్కూలుకు బయల్దేరినాము.ఎ.రంగంపేట దాటినాక జోడు బావుల దెగ్గిర సైకిల్ మీద నుంచీ పడిపోయినాం. ఇద్దరం ఒళ్లంతా దెబ్బలు తగిలించుకున్నాం. ఆ దినం కుంటుకుంటా పోతే స్కూల్లోనూ, ఇంట్లోనూ కూడా తిట్లు తప్పలా.

పీయూసీలోనే జన్మభూమి

చంద్రబాబు సీఎం అయినాక శ్రమదానం, జన్మభూమి కార్యక్రమాలు పెట్టింది రాష్ట్రంలో అందరికీ తెలుసు. అయితే మేము చదువుకునేటప్పుడే మా పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రమదానం చేయించాడు చంద్రబాబు. శేషాపురం, కందులవారిపల్లి, నారావారిపల్లి,ఎ.రంగంపేట గ్రామాల మీదుగా కొంటి కాలువ, బాపన కాలువ పారేవి. పీయూసీలో వుండగా అప్పటికి ఈ రెండు కాలువలూ పూడిపోయి, ముండ్ల చెట్లు పెరిగిపోయినాయి. కాలువలు కనిపించకుండాపోయాయి. అది చూసి చంద్రబాబు మమ్మల్నందరినీ వుడ్డ చేసి శ్రమదానంతో కాలువలు బాగు చేయిచ్చినాడు. అంతా పిల్లోల్లమే.. కాలవల్లోకి దిగి పూడిక తీసి, చెట్లన్నీ కొట్టేసి తిరిగి నీళ్ళు పారేదానికి అనువుగా చేసినాము.

రెండూళ్లలో పెరిగిన బిడ్డ

నారావారిపల్లికి, కందులవారిపల్లికి మధ్య పొలాలే అడ్డు. ఫర్లాంగు దూరానికి మించదు. మా అమ్మ, నాయన, మా అన్నలు ఇద్దురూ (చంద్రబాబు అమ్మమ్మ, తాత, మేనమామలు) చంద్రబాబును మురిపంగా చూసేవాళ్ళు. తక్కువంటే రోజులో రెండు సార్లన్నా ఆటికీ ఈటికీ తిరుగులాడేవాడు. రెండూర్లలో పెరిగినాడు.

మహార్జాతకుడు

చంద్రబాబు పుట్టింది తిరుపతి ప్రభుత్వాస్పత్రిలో...

మాది కందులవారిపల్లి. నారావారిపల్లికి ఫర్లాంగు దూరంలో వుంటుంది. మా అక్క అమ్మణ్ణమ్మను నారావారిపల్లిలో ఇచ్చినారు. మా ముగ్గురు అన్నదమ్ముల్లో నేనే కడగొట్టు. అప్పటికి నేను పసోన్ని. అక్కకు సాయంగా వుండమని నన్ను నారావారిపల్లికి పంపిచ్చిరి. చంద్రబాబు పుట్టింది తిరపతి ప్రభుత్వాస్పత్రిలో. అప్పటికి రుయాస్పత్రి లేదు. చంద్రబాబుకు, నాకు వయసులో పెద్ద అంతరం లేదు. వాళ్ళింట్లోనే ఇద్దరం కలిసి పెరిగినాము. మా అక్క వాళ్ళది నా చిన్నతనంలోనే పెద్ద సేద్యం. పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రైలు, పొట్టేళ్ళు వుండేటివి. గొర్రైలు, పొట్టేళ్ళు మేపే పని నాదే.

సాప మీద చంద్రబాబు... ఇంట్లోకి దూరిన పాము

చంద్రబాబు రోజుల బిడ్డగా వున్నపుడు కందులవారిపల్లిలోని మా ఇంట్లోనే అక్క వుండేది. ఇంట్లో సాప మీద చంద్రబాబును పడుకోబెట్టి బయట పనులు చేసుకుంటా వుంటే నాగుపాము ఇంట్లోకి దూరింది. ఆడోళ్ళంతా భయపడి గగ్గోలు పెట్టారు. మగోళ్ళు వచ్చి పామును పట్టి బయటకు తీసుకెళ్ళారు. దాని గురించి ఆడోళ్ళు గుర్తు చేసుకుని చెప్పుకునేది. అప్పట్లోనే వానికి (చంద్రబాబుకు) ఏందో మహర్జాతకం వుందనే వాళ్ళు.

రెండేండ్ల వయసులో నీళ్ళ తొట్టిలో పడిపోయినాడు!

రెండేండ్ల వయసులో చంద్రబాబు నీళ్ళ తొట్టిలో పడిపోయినాడంట. వాళ్ళ చిన్నాయన గభాల్న బయటకు తీసినాడంట. ఆ తీసేటప్పుడు తలకిందలుగా కాళ్ళు పట్టుకుని ఎలదీసినాడంట. దానికి వాళ్ళ నాయన 'తలకిందలగా కాళ్ళు పట్టుకుని పైకెత్తతావా నా బిడ్డని' అని తమ్ముని మీద గలాటకు పోయినాడంట.

చంద్రబాబు నొస్టన గాయం!

ఓ రోజు మా బావ ఖర్జూరనాయుడు సంతకు పోయుండి టెంకాయ తెచ్చినాడు. అప్పుడు నాకు పన్నెండేండ్లు వుంటాయి. చంద్రబాబుకు ఏడేండ్లు వుంటుంది. ఇంటి ముందర తిన్నె మీద టెంకాయ గొట్టినా. పగిలి సగం చిప్ప పైకి ఎగిరింది. అది పొయ్యి చంద్రబాబుకు నొస్టన తగిలింది. నెత్తురు బొడబొడా కారింది. అదిజూసి నాకు భయం పెరుక్కునింది. మా అక్కా బావ కొడతారేమోనని దూరంగా పరిగెత్తుకునిపోయినా. ఇప్పటికీ చంద్రబాబుకు నొస్టన ఆ మచ్చ కనిపిస్తుంది.



కనుమూరి చిన్నబ్బ నాయుడు

చంద్రబాబుకున్న ముగ్గురు మేనమామల్లో అందరికంటే చిన్నవాడు కనుమూరి చిన్నబ్బ నాయుడు. అక్కకు సాయంగా వుండేందుకు పసితనంలోనే కందులవారిపల్లి నుంచీ నారావారిపల్లిలోని అక్క ఇంటికి పంపించారు తల్లిదండ్రులు. చంద్రబాబు కంటే వయసులో ఐదేళ్ళు పెద్దవాడు. అక్క కుటుంబానికి సేద్యంలోనూ, పశుపోషణలోనూ, ఇంటి పనుల్లోనూ సాయంగా నిలిచి ఆ ఇంట్లోనే కుటుంబసభ్యుడిగా పెరిగిన మనిషి. చంద్రబాబు పుట్టింది మొదలు ముఖ్యమంత్రి అయ్యేవరకూ అన్నింటికీ ప్రత్యక్ష సాక్షి. చంద్రబాబు చదువు నుంచీ రాజకీయాల వరకూ అన్నింటా చేదోడువాదోడుగా మెలిగిన వ్యక్తి. ప్రస్తుతం నారావారిపల్లెలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

ఎన్టీయార్ అల్లుడు.. ఒకప్పుడు ఏఎన్ఆర్ అభిమాని

చంద్రబాబు సాక్షాత్తూ ఎన్టీయార్ అల్లుడు. అయినా సినీ రంగంలో ఆయన ఫేవరెట్ హీరో అక్కినేని. వినడానికి విచిత్రంగా అనిపించినా ఇది నిజం. తిరుపతిలో పీయూసీ చదివే రోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు సినిమా రిలీజైందంటే చాలు ఎక్కడున్నా మొదటి రోజు మొదటి షో చూడాల్సిందే. పదీ ఇరవై మంది స్నేహితులతో కలసి గుంపుగా వెళ్ళేవాళ్ళం. తిరుపతి ప్రతాప్ థియేటర్‌లో టికెట్ కౌంటర్ వాళ్ళను దబాయించి మరీ టికెట్లు తీసుకుని సినిమా చూసేవాళ్ళం.



చంద్రబాబు చదువుకున్న బడి

ప్రతి శనివారం అడ్డదావన కొండకు

శనివారం వచ్చిందంటే అందురం కొండకు పోవల్సిందే. పెద్దా చిన్నా అంతా గుంపుగా బయల్దేరేది. నారావారిపల్లి నుంచీ ఉత్తరంగా అడ్డదారిన అడివి గుండా శ్రీవారి మెట్టు చేరుకుని అక్కడ నుంచీ మెట్ల దారిన కొండ ఎక్కుతా వుంటిమి.స్వామి దర్శనం చేసుకుని మళ్ళా అదే దావన ఇంటికి చేరుకుంటా వుంటిమి.తిరుమల శనివారాలు వస్తే ప్రతి శనివారం పల్లిలో వాళ్ళు, చుట్టుపక్కల పల్లెల నుంచీ వచ్చే వాళ్ళతో కలసి గోయిందలు పెడతా కొండకు పోతా వుంటిమి. ఇంటి కాడ పెద్దోళ్ళు మనిషికి అర్ధరూపాయి,రూపాయి లెక్కన ఇచ్చేవాళ్ళుమేము అది కూడా కర్చుపెట్టకుండా అట్నే ఎనిక్కి తెస్తావుంటిమి. కాలేజీలో చేరేదాకా చంద్రబాబు ప్రతి శనివారం కొండకు మాతో పాటు వచ్చేది.

ఎజ్డీ డబులింజను బైకు బుల్లోడు



నారా సుబ్రమణ్యం నాయుడు

చంద్రబాబు స్వంత చిన్నాన్న అయిన నారా చిన్న పాపయ్యనాయుడు కొడుకు నారా సుబ్రమణ్యం నాయుడు. వయసులో ఐదేళ్ళు చిన్నవాడు. బాల్యంలో ప్రతి అడుగులో చంద్రబాబు వెన్నంటి నడిచిన వాడు. వ్యవసాయ బావుల్లో ఈతాడినా, తిరుమల కొండకు నడిచి వెళ్ళినా, చుట్టుపక్కల ఊళ్ళలో జల్లికట్టు చూసినా, ఎన్నికల్లో ప్రచారానికైనా... అన్న తోడు వదలని తమ్ముడు. కోర్టులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం నారావారిపల్లిలోనే నివాసం.

మడక దున్నేవాడు!

చంద్రబాబు మా సొంత పెద్దనాయన కొడుకు. నాకంటే ఐదేండ్లు పెద్దోడు.వ్యవసాయ పనులు బాగా చేసేవాడు. చెరుకు సాగుకు వెనక మడక దున్నడం, కోతలయ్యాక వాది కట్టడం వంటి పనులు చేసేవాడు. అప్పట్లో చెరుకు గానుగ రెండు నెలలు ఆడతావుంటిమి.గానుగలో చెరుకు పెట్టే పని కూడా చంద్రబాబు ఇష్టంగా చేసేవాడు. అయితే ఇంట్లో వాళ్ళు చంద్రబాబుకు పెద్దగా సేద్యం పనులు చెప్పేవాళ్ళు కాదు. మేనమామలు కూడా అయన్ను బాగా ప్రేమగా చూసుకునేవారు.

పొట్టేళ్ళమ్మిన ఖర్జూర నాయుడు

చంద్రబాబు చదువుకునేటప్పటికి వాళ్ళకు పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రైలు, పొట్టేళ్ళు వుండేవి.వాటిని నేనే మేపతా వుంటి. మళ్ళ రాత్రానూ మా పెద్దనాయన మనం మేపలేములేరా అని పాలికి వదిలేది మొదులుపెట్టినాడు. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మనకెందుకని మా పెద్దనాయన ఏమాత్రం అడ్డం చెప్పలేదు. వున్న పొట్టేళ్ళన్నీ అమ్మేసి 'ఎలక్షన్లలో ఖర్చు పెట్టుకో నాయనా' అని రూ. 60 వేలు ఇచ్చినాడు. అప్పటికి ఇంట్లో రెండు లోడ్ల బెల్లం స్టాకు వుంది. అయితే రేటు లేదని బెల్లం అమ్మలేదు. లేకపోతే అదిగూడా ఇచ్చేసి ఉండేవాడు.

ఈత నేర్పించింది చంద్రబాబే!

చదువుకునేటప్పుడు ఎండాకాలం వచ్చిందంటే చాలు పిల్లోల్లందరం బావులకాడికి పరిగెత్తేవాళ్ళం.గంటల కొద్దీ ఈతాడేవాళ్ళం. మా ఊరి పక్కనే తెల్లాకల శెట్టి బావి వుంది. ఆ బాయిలోనే అందరం ఈతాడేది. నా చిన్నప్పుడు ఊర్లో పిల్లకాయలందరినీ చంద్రబాబే వెనకంటీ పెట్టుకోని బాయి కాడకు పిల్చకపోయేవాడు. అప్పట్లో పిల్లోల్లకు ఈత నేర్పించింది ఆయనే.

పీజీలో ఎజ్డీ డబులింజన్ బైక్

చంద్రబాబు తిరపతిలో పీజీ చేసేటపుడు ఎప్పుడు చూసినా వెనకంటీ పదీ ఇరవై మంది పిల్లోల్లు వుండేది. ఎప్పుడన్నా ఇంటికొస్తే కూడా వెనకంటీ పది మందికి తక్కువ లేకుండా వచ్చేవాళ్ళు. మా పెద్దనాయన కొడుకును అట్ల చూస్తే చానా సంతోషపడిపోయేవాడు. కొడుకు నలుగురిలో దర్జాగా వుండల్లని ఎజ్డీ బైక్ కొనిచ్చినాడు. అది డబులింజన్ బండి. బుల్లెట్ కంటే ఎక్కువ సౌండ్ వచ్చేది. బడబడమని సౌండ్‌తో ఆ బండి మీద కొడుకు పోయేది చూసి మా పెద్దనాయన మురిసిపోయ్యేవాడు.

చంద్రబాబు కోసం ప్రచారానికి వందలమంది విద్యార్థులు

చంద్రబాబు 1978లో తొలిసారి ఎలక్షన్లలో పోటీ చేసినపుడు వెనకంటీ తిరిగిందీ, ప్రచారం చేసిందీ, ఇంటింటికీ పోయి ఓట్లడిగిందీ.. అంతా ఈడు పిలకాయలే. తిరపతి యూనివర్శిటీ నుంచే వందల మంది స్టూడెంట్లు ప్రచారానికి వచ్చినారు. ఇంటికాడ ఆడోళ్ళకు పులుసన్నం వండేదే పని. వాటిని పొట్లాలు కట్టి ప్రచారానికి పొయ్యే వాళ్ళకు అందిచ్చేది మా పని. ఎలక్షన్ చేసిందంతా పిల్లోల్లే.

బడికోసం జోలె పట్టాడు

శ్రమదానంతో సొంతూరికి రోడ్డు

నారావారిపల్లి నుంచీ మా కందులవారిపల్లి అర కిలోమీటరు దూరంలో వుంటుంది. మేమిద్దరం శేషాపురంలో ప్రైమరీ స్కూలు, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీలలో క్లాస్‌మేట్స్. అంతకంటే దగ్గర బంధువులం కూడా. దాని వల్ల చిన్నప్పటి నుంచీ కలసి పెరిగాము. కలసి చదువుకున్నాం. చంద్రబాబుతో జ్ఞాపకాలు ఒకటా రెండా?

రోడ్డు బాగయ్యింది

చంద్రబాబు పీజీ పూర్తి చేశాక 1977లో యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశాడు.ఆ సంవత్సరంలోనే పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. శ్రమదానంతో గ్రామాల్లో యువత అభివృద్ధి పనులు చేపట్టాలని అప్పట్లో సంజయ్ గాంధీ పిలుపిచ్చారు. దానిని చంద్రబాబు పట్టుదలగా తీసుకున్నాడు. అప్పట్లో ఎ.రంగంపేట నుంచీ నారావారిపల్లి, శేషాపురం మీదుగా భీమవరం వరకూ ఐదు కిలోమీటర్ల రోడ్డు చాలా అధ్వానంగా వుండేది. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు పోవడం కూడా కష్టమయ్యేది. రోడ్డంతా బురదగా వుండేది.చంద్రబాబు స్నేహితులందరినీ పోగేసి ఈ రోడ్డు బాగు చేసే పనికి పూనుకున్నాడు. అందరం నడుములు వంచాం.ఆయా గ్రామాల్లోని యువకులు వచ్చి కలిశారు. ఇలా ఐదు కిలోమీటర్ల రోడ్డు బాగు చేశాం.

హైస్కూలు కోసం జోలె పట్టుకున్నాడు

ఎ.రంగంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూలు మాత్రమే వుండేది. పిలకాయల పై చదువులకు ఇబ్బందిగా వుండేది. చంద్రగిరికి పోవల్లంటే వంకలు, కాలవలు దాటల్ల. తిరుపతి పోవల్లంటే దూరాభారం. దాన్ని హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని పెద్దోళ్ళంతా కలిసి చిత్తూరులో జడ్పీ ఆఫీసుకు పోయి అర్జీ ఇచ్చినారు. రూ. 8 వేలు కార్పస్ ఫండ్ కడితే అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పినారంట. అంత దుడ్లు ఎవ్వరిచ్చేది? చంద్రబాబు అప్పుడు తిరుపతిలో పీజీ చేస్తా ఉండాడు. మమ్మల్నందరినీ కలుపుకున్నాడు. రంగంపేట నుంచీ నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం దాకా జోలి పట్టుకుని తిరిగితే రూ. 5 వేలు వసూలైంది. తక్కువ పడిన మిగతా డబ్బు మేమందరం తలాకొంత వేసుకుని జడ్పీలో కట్టినాం.దాంతో రంగంపేట అప్పర్ ప్రైమరీ స్కూలు హైస్కూలు అయ్యింది.

కోళ్ళ ఫారం డబ్బంతా శీనయ్య మెస్‌కే!

చంద్రబాబుకు చుట్టూ దండిగా స్నేహితులుండాల్సిందే. పీయూసీ రోజుల నుంచీ ఇంతే. స్నేహితుల్లో ఎవరి చేతిలో డబ్బులున్నా అందరం పొలోమని శీనయ్య మెస్సుకు పోయి తినేసేది.డిగ్రీలో చేరినాక ఫ్రెండ్స్ ఇంకా ఎక్కువైనారు. శీనయ్య మెస్సుకు పొయ్యేది కూడా ఎక్కువైంది. అప్పట్లోనే చంద్రబాబు నారావారిపల్లిలో కోళ్ళఫారం పెట్టినాడు. వెయ్యి కోళ్ళు వుండేవి. ఆ కోళ్ళు అమ్మిన డబ్బంతా శీనయ్య మెస్సుకే ఖర్చు పెట్టుంటాడు.

చంద్రగిరి ఓట్ల ఆచారమే మార్చేసినాడు

చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రబాబు పోటీ చేయక ముందు దాకా ఎలక్షన్లలో పోటీ చేసిన నాయకులెవరూ ఇండ్లకు పోయి ఓట్లు అడిగిందే లేదు. ఊరికి ఒకరిద్దరు పెద్ద మనుషులుండేవాళ్ళు. వాళ్ళ ఇండ్లకు పోయి మాట్లాడుకోని వెళ్ళిపోయేవారు. ఆ ఊరి పెద్దలు చెప్పినట్టు ఊళ్ళో జనం ఓట్లు వేసేవాళ్ళు. 1978లో చంద్రబాబు ప్రతి ఇంటి గడపా తొక్కి ఓట్లు అడిగినాడు.ఇంటి ముందరకొచ్చి ఓటు అడిగినాడే అని చానా మంది ఆయనకు ఓట్లేసినారు.



కనుమూరి చంద్రశేఖర్ నాయుడు

కందులవారిపల్లికి చెందిన కనుమూరి చంద్రశేఖర్ నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు. బాల్యం నుంచీ కలసి చదువుకున్నారు. శేషాపురంలో 1వ తరగతి నుంచీ 5వ తరగతి వరకూ, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీ కూడా కలసి చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుత నివాసం కందులవారిపల్లిలో.

చదివేది ఆ రెండు నెలలే!

డిగ్రీ దాకా చంద్రబాబు యావరేజీ స్టూడెంటే. పీజీలో చేరాక చాలా మార్పు కనిపించింది. చంద్రబాబు చదివేది సంవత్సరంలో రెండు నెలలే. నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మిగతా టైమంతా తిరిగేదే. స్నేహితులందరం ఒక రూములోనే ఉడ్డగా ఉండేవాళ్లం. డిగ్రీ చదివేటపుడు తిరుపతి పొర్ల వీధిలో ఫ్రెండ్స్‌తో వుండేవాడు.పరీక్షలు దగ్గరికి రాగానే ఆకుతోట వీధిలో ఒక్కడే రూము తీసుకుని అక్కడికి వెళ్ళిపోయేవాడు. పట్టుదలగా చదివి 50 శాతానికి తగ్గకుండా మార్కులు తెచ్చుకునేవాడు.

డైకిన్ ప్లాంట్‌ను సందర్శించిన గ్లోబల్ ప్రెసిడెంట్

● శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ పట్ల ప్రశంస



టకేనాకకు స్వాగతం పలుకుతున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నౌహుమీ టకేనాక గురువారం శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా చైర్మన్, ఎండీ కేజే జావా ఆయనకు స్వాగతం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన టకేనాక ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా టకేనాక, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా శ్రీసిటీ ఎదుగుదలను రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా టకేనాకకు వివరించారు. ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సుస్థిరత ద్వారా ఈ ప్రాంత పారిశ్రామిక వృద్ధికి డైకిన్ అందించిన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థను ప్రశంసించిన టకేనాక పారిశ్రామిక వాడ స్థాయి, సామర్థ్యం, ఆధునిక మౌలిక సదుపాయాలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం, శ్రీసిటీ బృందం అందిస్తున్న సహాయ సహకారాలతో తమ సంస్థను మరింత విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. ఏసీ కంప్రెషర్లను ఉత్పత్తి చేయడానికి తైవాన్‌కు చెందిన రెచీ సంస్థ భాగస్వామ్యంతో డైకిన్ ఏర్పాటు చేస్తున్న నూతన తయారీ కేంద్రం, దేశంలో ఏసీ తయారీ హబ్‌గా ఎదగాలన్న శ్రీసిటీ లక్ష్యానికి మరింత బలం చేకూరుస్తుందన్నారు.

చెత్త సంపద ప్లాంట్ పనితీరు భేష్

●ఆర్థిక కమిషన్ బృందం కితాబు



వ్యర్థాల ద్వారా గుల్ల ఇసుక తయారీ విధానాన్ని ఆర్థిక సంఘం చైర్మన్‌కు వివరిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

రేణిగుంట, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూకివాకం పంచాయితీ పరిధిలోని నగర పాలక సంస్థ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక సంఘం కమిషన్ కితాబు ఇచ్చింది. గురువారం ఉదయం ఈ ప్లాంట్‌ను కమిషన్ సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. ఘన వ్యర్థాల, తడి చెత్త నిర్వహణ, కంపోస్టు, బయో మెథనైజేషన్ ప్లాంట్ తదితర అంశాల గురించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేష్ కుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, నివాస్‌లు బృందానికి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన పొడి చెత్తను ప్రాసెసింగ్ చేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిసామని చెప్పారు. తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తామన్నారు. మార్కెట్, హోటల్స్ వ్యర్థాలను వంట గ్యాస్‌గా ఉత్పత్తి చేసి విక్రయిస్తామన్నారు. నగరంలో రోజూ సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా విభజించి గుల్ల, ఇసుకగా మారుస్తామన్నారు. బృంద సభ్యులు ఆసక్తిగా ఈవిషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగపతినాయుడునగర్, 786రఫీ వీధి, రజకుల కాలనీ తదితర ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ తెలిపారు. 11కేవీ విద్యుత్ తీగలకు సంబంధించి పోల్స్ ఏర్పాటు, మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఆ తర్వాత 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం తెలిపారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు నిహారిక



వెంకటగిరి, ఏప్రిల్ 17 : (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరికి సెంట్రల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నిహారిక జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు చెస్ అకాడమీ నిర్వాహకులు నర్రా విజయ్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రీజనల్ స్పోర్ట్స్ మీట్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో 3.5 పాయింట్లు సాధించి జాయితీ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని వివరించారు.

చెందోడులో పోషణ్ పక్వాడ

కోట, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని చెందోడు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత హాజరై గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆవశ్యకత గురించి తల్లులకు వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు కోమలి, రాజేశ్వరి, రూప, లత, భారతి, సునీత తదితరులు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎస్కాటిక సంబరాలు

కోట, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 17న ప్రారంభమైన ఎస్కాటిక సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, బృందనృత్యం, సంగీత వాయిద్యాల పోటీ, మిమిక్రీ, నాటికలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఆయా విభాగాధిపతులు, విద్యార్థులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కోట, ఏప్రిల్ 17: కోటలోని ఎన్‌సీఆర్ నగర్‌లో వైద్యం పేరుతో ఓ మహిళకు మత్తు మందు ఇచ్చి బంగారంతో పరారైన నిందితుడు నిజమాల సంపత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. ఈ నెల 10వ తేదీన ఎన్‌సీఆర్ నగర్‌లో ఓ మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా నెల్లూరు హరినాథపురానికి చెందిన సంపత్‌కుమార్ వైద్యం పేరుతో ఆమె ఇంటికి వచ్చాడు. ఆమెకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఆమె చేతులకు ఉన్న రూ.2.90లక్షల విలువ చేసే బంగారు గాజులను దోచుకుని పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు సంపత్‌కుమార్‌ను మైక్రోటవర్ కాలనీ వద్ద కాపుకాచి పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కోట, ఏప్రిల్ 17 : కోటలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం కోట అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల్లో మనుషులు చిక్కుకున్నప్పుడు వారిని కాపాడే విధానాన్ని స్థానిక అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎడగారుకు అన్నదాత సన్నద్ధం



తిన్నేలపూడిలో ఎడగారుకు పోసిటన్న నారుమడి

కోట, ఏప్రిల్ 17 : ప్రస్తుత సీజన్‌లో ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. డెల్టా గ్రామాల్లో ఎడగారుసాగుకు సంబంధించి వరి నాడుమడులు పోసుకోవడం, అడుసు దుక్కిలు దున్నుతుండడంతో గ్రామాల్లో సాగు సందడి మొదలైంది. కోట మండలంలోని స్వర్ణముఖి నదీ పరివాహక గ్రామాలైన రాజుపాళెం, గూడలి, దక్షిణపాలెం, రంగన్నగుంట, అల్లంపాడు, వంజివాక, వెంకన్నపాళెం, కొక్కుపాడు గ్రామాల్లో ఎడగారు వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. పొలాలను దుక్కిలు చేస్తూ చదును చేస్తున్నారు. ప్రధానంగా డెల్టా గ్రామాల్లో వరి నాడుమడులు పోసుకుంటున్నారు. బావులు, ఫిల్టర్ పాయింట్ల కింద ఎడగారు సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల రైతులు 1010 రకం పోస్తుండగా ఇంకొందరు సన్నాల రకాలను రైతులు నారుమడులుగా పోసుకుంటున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులు ఇచ్చే నారుమడులు పోసుకునేందుకు సిద్ధమయ్యారు.

వైసీపీకి బిగ్ షాక్..!

● టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు

తడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగలింది. మండల స్థాయి నాయకులు ఒక్కొక్కరుగా ఆపార్టీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గ్రూపు రాజకీయాలతో రచ్చకెక్కిన ఆ పార్టీ విభేదాలు ప్రస్తుతం కూడా అలాగే కొనసాగుతున్నాయి. కొందరు నియోజకవర్గ నాయకులు వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చేందుకు గతంలోనే తీవ్ర ప్రయత్నాలు చేశారు. టీడీపీలోని కొందరు నాయకులు వారిని చేర్చుకునేందుకు కొంత ఉత్సాహం చూపినా అధిష్ఠానం మాత్రం అంగీకరించలేదు. అప్పటి నుంచి అడపాదడపా సర్పంచులు, నాయకులు టీడీపీలో చేరుతూ వస్తున్నారు. ఇప్పుడు వారి బాటలోనే తడ మండలానికి చెందిన బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు, ప్రస్తుత జడ్పీటీసీ బిందుమతి కుటుంబసభ్యులు ఆర్.రత్నం టీడీపీలో చేరేందుకు సిద్ధపడ్డారు. ఆ కుటుంబం వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే కొనసాగుతూ బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉంది. దీంతో వైసీపీ పెద్దలు ఆ కుటుంబం పార్టీ వీడకుండా తీవ్రప్రయత్నాలే చేశారు. అయితే మూడేళ్లనుంచి వైసీపీ పెద్దలు కానీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కానీ తమను పట్టించుకోలేదని పైగా తమను అవమానపరిచారంటూ ఈ పరిస్థితులు తట్టుకోలేకే తాము టీడీపీలో చేరుతున్నట్లు ఆర్.రత్నం ఆంధ్రజ్యోతికి తెలియజేశారు. అలాగే నాయుడుపేటలో బలమైన సామాజికవర్గానికి చెందిన నాయకుడు పొట్లపూడి రాజేష్, గురుమూర్తిలతో పాటు మరికొందరు కౌన్సిలర్లు బుధవారం రాత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ భారీ షాక్ తగిలినట్లే చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన మరికొంత మంది మండల నాయకులు టీడీపీ పంచన చేరేందుకు సిద్ధం మవుతున్నట్లుగా సమాచారం. ఫలితంగా టీడీపీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పొదుపు మహిళలకు టోకరా

● రూ. 5 లక్షలు స్వాహా చేసిన వీవోఏ
● పోలీసులకు ఆశ్రయించిన పొదుపు మహిళలు



పొదుపు మహిళలతో కలసి ఏపీఎం హేమామాలినికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు హరినాయుడు, యుగందర్‌గౌడ్

పెళ్లకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు సంబంధించిన రూ.5లక్షల నగదును వీవోఏ స్వాహా చేసింది. దీంతో బాధిత గ్రూపు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పునబాక పంచాయతీలో 22 పొదుపు సంఘాలు ఉన్నాయి. వినాయక, శ్రీవెంకటేశ్వర, లక్ష్మీ పొదుపు సంఘాలకు సంబంధించిన పొదుపు నగదుతో పాటు బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలను రికవరీ కింద సభ్యులు నెలా నెలా వీవోఏ వెంకటమ్మకు చెల్లిస్తున్నారు. ఇటీవల ఆడిట్‌లో వీవోఏ అవినీతి బయటపడింది. ఆమె నుంచి వినాయక గ్రూపునకు సంబంధించిన రూ.3 లక్షల 50 వేలు రికవరీ చేశారు. దీంతో మిగిలిన గ్రూపులకు సంబంధించిన నగదు లావాదేవీలపై ఆరా తీశారు. సంఘ సభ్యులు చెల్లిస్తున్న సుమారు రూ.5 లక్షలకు పైగా నగదును స్వాహా చేసినట్లు గురువారం ఆయా సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెలుగు ఏపీఎం హేమమాలిని వివరణ కోరగా ఒక్క రూపాయి స్వాహా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. సభ్యులు ఒక్క రూపాయి కూడా నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోట, ఏప్రిల్ 17 : ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న కార్పొరేట్ స్థాయి విద్యపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు పల్లెబాట పట్టారు. మండల పరిధిలోని వెంకన్నపాళెం మోడల్‌ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్కారు విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో బోధనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు మహమ్మద్‌రజ్వీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావిధానంలో నూతన మార్పులు : ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో మునిరత్నం, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విద్యావిధానంలో నూతన మార్పులు తీసుకువచ్చి విద్యాభివృద్ధికి నడుంబిగించిందని ఎంఈవో మునిరత్నం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబుతో కలసి విద్యాప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో మోడల్ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేస్తున్నట్లు వివరించారు. ఎంఈవో-1 శాంతి, సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో జాతీయ సదస్సు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ సైన్సెస్ రంగాల్లో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆవిష్కరణలు, పరిశోధనలపై పలువురు విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించారు. జేఎన్‌టీయూఏకు చెందిన డాక్టర్ ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఆర్.రమణారెడ్డి టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ ఇన్నోవేషనల్‌పై పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఏవో మనోహర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సురేష్ గురువారం ప్రకటన విడుదల చేశారు.

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ



సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 8688888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు రుజువు చేశారని టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ప్రతినిధి ఏసుపాక పెంచలయ్య అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కోటేశ్వరరావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ కార్మికులు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ ఏ వెంకటగిరి డిపో సెక్రటరీ కేవీ రత్నం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో వద్ద ఎన్ఎంయూ ఏ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డిపో ప్రెసిడెంట్ పీవీ రావు గారి ఆధ్వర్యంలో టీ విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని విభాగాల్లో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రజాక్, బాష, కృష్ణారెడ్డి, బాస్కర్, రాజా, కేఎల్ రావు, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ఆర్టీసీ ఉద్యో గుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం డిపో ప్రధాన గేటు ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షుడు పోలయ్య, శేఖర్, ఎం.రాజేష్, షాజహాన్, శశిధర్, సునీల్, రఫీ, జానకిరామ్ పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి అన్నారు. గురువారం స్థానిక పాఠశాలల్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. పరవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలియ జేశారు. హాల్ టికెట్లులో అభ్యర్థి ఫొటో లేకపోతే ఫొటో అతికించి దానిపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం, సీలు, విడిగా ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. వివరాలకు 8333066000ను సంప్రదించాలని కోరారు.

సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళి

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కృషి మరువలేనిదని గ్రంథాలయ అధికారి అంజయ్య అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

రేపు నృసింహస్వామి కల్యాణోత్సవం

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న పట్టణంలోని మదర్ అకాడమీ పాఠశాలలో నిర్వహించే పెనుశిల నృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని భక్తబృందం తోట రమేష్, సీహెచ్ ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

ట్రాక్టరు కింద పడి విద్యార్థి మృతి

డక్కిలి, ఏప్రిల్ 17 : (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన దేవులపల్లి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివశంకర్ కథనం మేరకు.. దేవులపల్లి గ్రామానికి చెందిన పార్థు(12) ఆరో తరగతి చదువుతున్నాడు. ఉదయం డి.వడ్డిపల్లిలోని జడ్పీ హైస్కూలుకు వెళ్లాడు. బడి వదలగానే సహచర విద్యార్థులతో కలిసి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో మాధవాయపాళెం వైపు వెళుతున్న ట్రాక్టరు ఎక్కారు. దేవులపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే ట్రాక్టరు కుదుపులకు పార్థు కిందపడిపోయాడు. ట్రాక్టరు చక్రం అతడిపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్సీ వర్గీకరణతో అందరికీ న్యాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణతో ఎస్సీ ఉపకులాల వారికి న్యాయం జరుగుతుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జి.జకరయ్య అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూపు 1, 2, 3గా ఉపకులాలను విభజనచేసి విద్య, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం తీసుకోవడం వల్ల అందరికీ న్యాయం జరిగిందన్నారు. ఎస్సీ సెల్ నాయకులు జి.బాబు, పెంచలయ్య, శ్రీనివాసులు, ఏలిమేటి బుజ్జయ్య, వెంకటస్వామి, డేగా ప్రసాద్, ప్రదీప్, చెంగయ్య, మునస్వామి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



సిలిండర్ నుంచి వచ్చే మంటలను అదుపుచేస్తున్న విద్యార్థిని

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలకు కారణాలు, అధిగమించడం ఎలా అనే అంశాలపై ఫైర్ ఆఫీసర్ సూరిశెట్టి నేతాజీ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక వేదవ్యాస విద్యాసంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అగ్నిప్రమాదాల గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి మంటలను ఆర్పేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగితే అదుపు చేయడాన్ని విద్యార్థిని ద్వారా చేయించి అవగాహన కల్పించారు. విద్యాసంస్థ ప్రతినిధులు, ఫైర్ సిబ్బంది శివయ్య పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నేతలు, ఎస్టీ కాలనీవాసులు

పుత్తూరు టౌన్/పుత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మండలంలోని గోపాలకృష్ణాపురం ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానం ఏర్పాటు చేయాలని, ఇటుక బట్టీల కోసం గ్రావెల్ అక్రమ తరలింపును అరికట్టాలని.. తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక ధర్మరాజుల ఆలయ మైదానం నుంచి ర్యాలీగా వచ్చి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రాన్ని ఆర్ఐ గురుస్వామికి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేష్, నందయ్య, మునిరాజా, సర్పంచ్ వేలాయుధం, గోపాలకృష్ణాపురం ఎస్టీ కాలనీవాసులు వెంకటరత్నం, రామచంద్రయ్య, ఆనందయ్య, కాంతారావు, రాగమ్మ, ఎల్లమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎంయూ నిరసన ప్రదర్శన

పుత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీసీ గ్యారేజి ముందు ఎన్ఎంయూ కార్మికులు గురువారం సమస్యల పరిష్కారం కోరుతూ ప్లే కార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు సుందరం మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను, ఈహెచ్ఎస్‌లను కేటాయించాలని, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. శివకుమార్, రమేష్, దొరబాబు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు అన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద గురువారం ట్రాక్టర్ మడకలు, స్ప్రేయర్లు సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతల వారీగా అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు జానా వెంకటయ్య, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వరరావ్, ఉమాపతి, ఆదినారాయణరాజు, శ్రీనివాసులు, కుమార్, బాబు, బత్తి నాయుడు, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు నుంచి కుప్పానికి ముగ్గురు సచివాలయ సిబ్బంది బదిలీ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కుప్పంలో పరిపాలనా సౌలభ్యం నిమిత్తం పుత్తూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని బదిలీ చేశారు. వీరిలో టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు ఆర్.మనోజ్, కె.వినోద్‌కుమార్, శానిటేషన్ సెక్రటరీ మునస్వామి ఉన్నారు. పురపాలక శాఖ ఆర్డీ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆన్ డిప్యుటేషన్ పద్ధతిలో విధులు కేటాయిస్తూ బదిలీ చేశారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని గురువారం రిలీవ్ చేయగా, మునస్వామిని రిలీవ్ చేయలేదు.

1 నుంచి కామాక్షి సమేత సదా శివేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉభయదాతలతో సమావేశమైన ఈవో జయకృష్ణ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలో కొలువుదీరిన కామాక్షి సమేత సదా శివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈవో జయకృష్ణ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం ఆలయ ఉభయదాతలతో ఈవో సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఉభయదాతలు, స్థానిక పెద్దల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. భక్తులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి జీవరత్నం నాయుడు, దిలీప్ రాయల్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గిరిజనులకు త్వరలో ఇళ్ల పట్టాలు

● ఎమ్మెల్యే ఆదిమూలం



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరడం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న గిరిజనులకు ఇళ్ల పట్టాలిప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. పేరడం గిరిజన కాలనీలో బుధవారం రాత్రి కాలనీకి చెందిన మేకల రామయ్య, మేకల రాణి గుడిసెలు అగ్నికి ఆహుతైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం అక్కడకు చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ సాయంగా ఒక్కొక్కరికి 20 కేజీల బియ్యం, రూ.5వేలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని గిరిజన కాలనీలో ఉంటున్న గిరిజనులందరికీ పట్టాలిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామస్వామి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్ఐ సురేష్, సర్పంచ్ కనకరాజ్, టీడీపీ నాయకులు పరమశివం, చిన్న, వెంకటరమణ, వెంకటేశులు, ప్రభాకర్‌రెడ్డి, గణేష్ జనసేన బాలమురళి, సీపీఎం నాయకులు దాసరి జనార్ధన్, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అమరా ఆస్పత్రిలో లాపరోస్కోపిక్ విప్పిల్స్ శస్త్ర చికిత్స విజయవంతం



మునికృష్ణయ్యతో వైద్య బృందం

రేణిగుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి వద్ద ఉన్న అమరా ఆస్పత్రిలో లాపరోస్కోపిక్ విప్పిల్స్ శస్త్ర చికిత్స విజయవంతమైందని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ మునికృష్ణ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మునికృష్ణయ్య(60) గత రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ అమరా ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. సంక్లిష్టమైన పరిస్థితిలో ఉన్న రోగికి విప్పిల్స్ ప్రక్రియ ద్వారా అధునాతన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు డాక్టర్ మునికృష్ణ చెప్పారు. మునికృష్ణయ్య ఆరోగ్యం బాగుపడటంతో గురువారం డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ల బృందాన్ని అమరా హాస్పిటల్ చైర్మన్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని ప్రత్యేకంగా అభినందించారని ఆయన చెప్పారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ సమస్యలకు అమరా ఆస్పత్రిలో అధునాతన శస్త్ర చికిత్సలు సామాన్య ప్రజలకు అందుబాటులో తెచ్చామని తెలిపారు.

కోర్టుకు హాజరైన వినుత



కోర్టుకు హాజరైన కోట వినుత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రేణిగుంట పట్టణంలోని శ్రీరాముడి ఆలయానికి చెందిన స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేశారని తెలిసి పరిశీలించడానికి వెళ్లిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుతపై మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రోద్బలంతో కేసులు పెట్టారు. ఈ నేపథ్యంలో ఆమె గురువారం తన భర్త కోట చంద్రబాబుతో కలిసి తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు హిందువుల ఆలయాల స్థలాలను కబ్జాలు చేసిన నాయకులు ఇపుడు హిందువుల ఆలయాల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న ముత్యాలమ్మ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ జాతర గురువారంతో ముగిసింది. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 8గంటలకు పురవీధుల్లో గంగపెట్టె ఊరేగింపు జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మ గుడివీధిలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ముత్యాలమ్మ ముగ్గు భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలోని సచివాలయానికి సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమల వారు గురువారం రూ.46వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ పీఆర్వో మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా దీనిని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి హబీబ్, ఇన్‌ఛార్జి హౌసింగ్ ఏఈ హేమకుమార్, సీసీఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 3, 4, 5 తరగతులు ఏయే పాఠశాలల నుంచి ప్రతిపాదించిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం అవుతున్నాయో ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు పిల్లలను బడిలో చేర్పించుకోవాలని సూచించారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో వారికి సంబంధించిన తరగతుల్లో కూర్చుబెట్టాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో ఉన్న పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలన్నారు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, తేజ, రవికుమార్‌రెడ్డి, ఉదయ్, వెంకటరమణయాదవ్, నవీన్, దినేష్, మునిచంద్ర, ప్రదీప్ ఎకుమార్, దినేష్, శ్రీను, ప్రభాకర్, నవీన్, రాజా, మునికుమార్, వీర మహిళలు శారద, గాయత్రి, బత్తెమ్మ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్యాస్, ఆయిల్, విద్యుత్ అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అదేవిధంగా పై అంతస్తులో అగ్నిప్రమాదం జరిగినా... దట్టమైన పొగలో ఇరుక్కుపోయిన వారిని ఎలా కాపాడాలో విద్యార్థుల చేత చేయించి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్, అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది తిరుమలరెడ్డి, సునీల్, అమర్‌నాథ్, ధనశేఖర్, రాజా, మునిశేఖర్, రంజిత్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సత్యవేడు: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సత్యవేడు అగ్నిమాపక కేంద్ర ప్రధాన అధికారి రాజయ్య తెలిపారు. అగ్ని ప్రమాద వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంజేపీటీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు - తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అగ్నిమాపక సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు, గోవిందరాజులు, సుబ్రమణ్యం, కోటి, చంద్రన్, రవికుమార్, నరేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు



హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్దశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా సంకట చతుర్దశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా గురువారం అంజి అంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన పూజలు నిర్వహించి, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం అభిషేకం నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ప్రభాకర్ రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం మండలంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయనముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు దిశ, దశ మార్గాలు చూపి, పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభాకర్ రాజు సేవలు అనిర్వచనీయమని ప్రశంసనీయమన్నారు. అనంతరం ప్రభాకర్‌రాజుకు శాలువా కప్పి, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రీకాళహస్తి మీడియా కోఆర్డినేటర్‌గా దుర్గాప్రసాద్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రీకాళహస్తి మీడియా కోఆర్డినేటర్‌గా నాగమల్లి దుర్గాప్రసాద్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పాత్రికేయులు, టీడీపీకి మధ్యవర్తిగా నిలిచి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. పలువురు పాత్రికేయులు ఆయనను అభినందించారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

పిచ్చాటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ దారుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి, దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సంఘం సభ్యులకు డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతమ్మ పిలుపునిచ్చారు. రైతు ఉత్పత్తి దారుల మండల స్థాయి సమావేశం వెలుగు మండల మహిళల సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గ్రూపుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను సేకరణ చేసే విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం హార్టికల్చర్ అధికారులు పంటలకు వచ్చే చీడ పీడలు, నివారణ చర్యల గురించి వివరించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఏపీఎం దాక్షాయణి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా గ్రూప్ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ విజయమ్మ, ఏపీఎం చంద్రకళ, సీసీలు సుబ్రహ్మణ్యం, నాగేంద్రబాబు, శశికళ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గ్రూపు లీడర్లు, ఎంఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో 'సంపద తయారీ కేంద్రం'



నామరూపాలు లేని చెత్త నుంచి సంపద కేంద్రం

కేవీబీపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కేవీబీపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం దుస్థితికి చేరుకుంది. నామరూపాలు లేకుండా దానిపై అమర్చిన రేకులు, దొంగల పాలైపోయాయి. అయినా ఎవరూ పట్టించుకునేవారులేరు. ఇప్పటికీ వీధుల్లోని చెత్తను తీసుకెళ్లి బయట పారవేసి వస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడంతో దానిపై వేసిన రేకులు, పైపులు అన్ని దొంగల పాలై దుస్థితికి చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని పునర్నిర్మించాలని కేవీబీపురం ప్రజలు కోరుతున్నారు.

సన్‌షైన్ స్టార్ అవార్డు గ్రహీత తల్లిదండ్రులకు సన్మానం



విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్



మంత్రి లోకేష్ నుంచి అవార్డును అందుకుంటున్న కమలశ్రీ, తల్లి భువనేశ్వరి

పుత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సన్‌షైన్ స్టార్ అవార్డు గ్రహీత కమలశ్రీ తల్లిదండ్రులను గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ రఘుపతి ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన కమలశ్రీ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి సన్‌షైన్ స్టార్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణవనం గ్రామానికి చెందిన కమలశ్రీ తల్లిదండ్రులు మదనాచారి, భువనేశ్వరిలను అధ్యాపక బృందం సన్మానించింది. అలాగే కళాశాలలో ఇతర గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం సభ్యులకు ఘన స్వాగతం



అరవింద్ పనగారియాకు, పయ్యావుల కేశవ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా, కమిటీ సభ్యులకు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగం గా గురువారం మధ్యాహ్నం వేరు వేరు విమానాల్లో విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న అరవింద్ పనగారియా, సంఘం సభ్యులకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, నగరపాలక కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరివెళ్లారు. వీరితో పాటు వచ్చిన డెలిగేట్స్‌కు సంబంధిత లైజన్ అధికారులు స్వాగతం పలికారు.

వైభవంగా చీరాలమ్మ జాతర

రేణిగుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైభవంగా చీరాలమ్మ జాతరను ఏడు గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామం చుట్టు పక్కల ఆరు గ్రామాల ప్రజలు మల్లిమడుగు గుట్టపై వెలసిన చీరాలమ్మకు ఆచారం ప్రకారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పొంగళ్లు వండి, నైవేద్యం సమర్పించారు. మేకలు, పొట్టేళ్లు, దున్నపోతులు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అర్బన్ పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు.

ఆస్తి కోసం బాబాయిపై దాడి



గాయపడిన లక్ష్మయ్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం సొంత బాబాయిపై దాడి జరిగిన ఘటన గురువారం శ్రీకాళహస్తి మండలం గొల్లపల్లి పంచాయతీ పరిధిలోని బీవీపురంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు బీవీపురం గ్రామానికి చెందిన లక్ష్మయ్య(72) తపాలాశాఖలో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. తన అన్న కుటుంబంతో గత కొంతకాలంగా ఆస్తి విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో అన్న కుమారుడు, వదిన గురువారం ఆస్తి విషయమై వాగ్వాదానికి దిగారు. ఆగ్రహంతో లక్ష్మయ్యపై కర్రలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం లక్ష్మయ్య శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. దాడి ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

టీబీపురంలో భూముల రీసర్వే ప్రారంభం

బుచ్చినాయుడుకండిగ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూలో గురువారం భూముల రీసర్వేను ఆర్ఎస్‌డీటీ చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిమ్మభూపాలపురం గ్రామ రెవెన్యూ పరిధిలో తిమ్మభూపాలపురం గ్రామంలో 384.98 ఎకరాలు, చల్లమాంబపురంలో 265.55 ఎకరాల భూమిని రీసర్వే చేస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు గ్రామాల సరిహద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్వేయరు రాజ్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు ఉమాపతి ఇటీవల మృతి చెందాడు. గురువారం ఉమాపతి కుటుంబ సభ్యులను శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పుచ్చకాయల కోసం గిరిజనులపై దాడి



గాయపడిన సుధాకర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయలు అడిగినన్ని ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి గిరిజనులపై దాష్టికాన్ని ప్రదర్శించాడు. బాధితుడి కథనం మేరకు ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీకి చెందిన సుధాకర్ అనే గిరిజన కుటుంబం ఇదే మండలంలోని ముసలిపేడు వద్ద ఓ రైతు వద్ద కూలీలుగా పనిచేస్తుంటారు. రైతు తన పొలంలో పుచ్చకాయ సాగు చేశాడు. అక్కడ పనిచేసే సుధాకర్ కుటుంబం పొలం ముందర రోడ్డుపై గత కొద్దిరోజులుగా పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. రైతు ట్రాక్టర్‌లో పుచ్చకాయలను తీసుకుని పలు గ్రామాల్లో సంచరిస్తూ అమ్ముకునేవాడు. ఈ క్రమంలో తోట వద్ద గురువారం సుధాకర్ తన అన్న కుమార్తె బత్తెమ్మ(18)తో పుచ్చకాయలను అమ్ముకుంటున్నారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని వెంటబెట్టుకుని ద్విచక్ర వాహనంపై బాలిక బత్తెమ్మ వద్దకు వచ్చి, తనకు తక్కువ ధరకు పుచ్చకాయలు ఇవ్వాలని వాగ్వాదానికి దిగాడు. తాము రూ.10 చొప్పున అమ్ముతున్నట్లు చెప్పగా, రూ.4కే ఇవ్వాలని బత్తెమ్మను బూతు పదజాలంతో దూషించాడు. ఇదివిన్న సుధాకర్ ఎందుకు అలా మాట్లాడుతావంటూ నిలదీశాడు. దాంతో ఆ వ్యక్తి సుధాకర్‌పై చెయ్యి చేసుకోవడంతో రాయిపై పడి గాయపడ్డాడు. అంతటితో ఆగకుండా దాడిచేసిన వ్యక్తి వెంటనే ఫోన్ చేసి హుటాహుటిన మరో ముగ్గురిని అక్కడికి పిలిపించాడు. మళ్లీ నలుగురు కలిసి గిరిజన రైతు కూలి సుధాకర్‌పై రాళ్లతో దాడి చేశారు. అక్కడే ఉన్న అన్న కుమార్తె బత్తెమ్మ దాడి చేసేవారిని కాళ్ల పట్టుకుని ప్రాధేయపడినా వారు కనికరించలేదు. అటుగా వెళ్లే కొందరు వాహనదారులు దాడిచేసేవారిని అడ్డుకోవడంతో పరారయ్యారు. సుధాకర్ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. ఈ ఘటనపై బాధితుడు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వారు విచారణ చేపట్టారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకువాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బజావతి, శిల్ప అన్నారు. మండలంలోని పాండూరు సచివాలయానికి చెందిన అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీధి నాటకాలతో వైసీపీ కుట్ర: టీడీపీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వీధి నాటకాలతో వైసీపీ కుట్ర చేస్తోందని టీడీపీ బీసీ విభాగం నాయకులు ఆరోపించారు. తిరుపతి గోశాల వద్ద టీడీపీ నాయకులకు సంఘీభావంగా వారు మాట్లాడుతూ నాస్తికుడు, హిందూ ద్వేషి అయిన కరుణాకరరెడ్డి వంటి వారు టీటీడీపై, గోవిందుడిపై చేస్తున్న విషపూరిత కుట్రలను పటాపంచలు చేయడానికి కూటమి నాయకులు గోశాల వద్దకు చేరుకున్నారన్నారు. అయితే కరుణాకరరెడ్డి, వైసీపీ నాయకులు తమను పోలీసులు గృహ నిర్బంధం చేశారన్నారు. పోలీసులు గోశాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినా తమ తప్పులు బయటపడుతాయని ఇలా దొంగ నాటకాలకు తెరతీశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, బీసీ విభాగం నాయకులు ఉమేష్‌రావు, వజ్రం కిషోర్, రామచంద్రయ్య, మునిరెడ్డి, చింతగింజల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆరోపణలు అనైతికం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆరోపణలు అనైతికం, పసలేనివని టీడీపీ తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు తక్కలపాటి ప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అటు ప్రజల్లో, ఇటు టీడీపీ కార్యకర్తల్లో సీఎం చంద్రబాబుపై వ్యతిరేకత తీసుకురావాలన్న కుట్రతో టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి ఇలాంటి ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి బలి తీసుకుంది వారి హయాంలోనే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీటీడీలో అన్ని విభాగాలను ప్రక్షాళన చేసి, గోశాలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. ఇది చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లడం ప్రారంభించారని ఆయన ఆరోపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యంపెంపు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని అధికారులు పెంచారు. 5ఎంవీఏగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను 8ఎంవీకే పెంచారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రొటెక్షన్ ఏడీలు నాగరాజు, రమేష్, ఏఈలు మోహన్, విజయ్‌వెంకట్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.